# పతాకం న్యూస్

APTEL/25/A2082

PATHAKAM NEWS TELEGU DAILY // తెలుగు దినపత్రిక

సంపుటి : 01 | సంచిక : 34 | విశాఖపట్నం | 4-11-2025 మంగళవారం | చీఫ్ ఎడిటర్ : ఎస్.ఎస్. రాజు | పేజీలు: 8 | వెల: రూ.5/-

Volume : 01 | Issue : 34 | VISAKHAPATNAM | 4-11-2025 TUESDAY | CHIEF EDITOR: S.S. RAJU | Pages:8 | Rate: Rs.5/-



రిపోర్టర్లు కావలెను

పతాకం న్యూస్

తెలుగు దిన పత్రికలో పనిచేయుటకు శ్రీకాకుళం, పాడేరు, గోదావరి జిల్లాలు తో పాటు ఆంధ్రప్రదేశ్‌లో గల రాయలసీమ, జిల్లాలో జిల్లా రిపోర్టర్స్ కావలెను.

అనుభవం ఉన్న వారికి మొదట ప్రాధాన్యత ఇవ్వబడును.

ప్రతి వార్త ఉన్నది ఉన్నట్టుగా రాసి చూపిద్దాం రండి...

ఆఫీస్ ఇంఛార్జ్ : ఎల్.కృష్ణ రావు

సంప్రదించవలసిన మా ఫోన్ నంబరు

9516171797, 9849349934


## రంగారెడ్డి జిల్లా చేవెళ్లలో ఆర్టీసీ బస్సును ఢీకొన్న టిప్పర్

# 21 మంది దుర్మరణం





**చేవెళ్ల, పతాకం న్యూస్:** రంగారెడ్డి జిల్లా చేవెళ్ల సమీపంలో హైదరాబాద్–బీజాపూర్ జాతీయ రహదారిపై మీర్జాగూడ వద్ద సోమవారం ఉదయం కంకర లోడుతో వెళుతున్న టిప్పర్ లారీ, ఆర్‌టిసి బస్సును ఢీకొట్టింది. ఈ ఘోర ప్రమాదంలో మరణించిన వారి సంఖ్య 21కి చేరింది. టిప్పర్ డ్రైవర్ సహా బస్సులోని 23 మంది ప్రాణాలు కోల్పోయారు. పలువురు ప్రయాణికులు తీవ్రంగా గాయపడ్డారు. కంకర లోడ్‌తో వెళుతున్న టిప్పర్ లారీ, తాండూరు నుంచి హైదరాబాద్‌కు వెళుతున్న ఆర్టీసీ బస్సును ఢీకొట్టడంతో ఈ ప్రమాదం జరిగింది. దీంతో బస్సులో కుడి వైపు సీట్లలో ఉన్న ప్రయాణికులు అక్కడికక్కడే మృతి చెందారు. తాండూరు నుంచి ఈరోజు తెల్లవారుజామున 4.45 గంటలకు ఆర్‌టిసి బస్సు బయలుదేరగా.. అక్కడే 30 మంది ప్రయాణికులు బస్సు ఎక్కినట్లు తెలుస్తోంది. మృతుల్లో తాండూరు వాసులే ఎక్కువ మంది ఉన్నట్లు సమాచారం. ఈ ప్రమాదానికి ప్రధాన కారణం టిప్పర్ లారీ డ్రైవర్ నిర్లక్ష్యమేనని పోలీసులు ప్రాథమికంగా నిర్ధారణకు వచ్చారు. అతివేగంతో టిప్పర్‌ను నడపడం.. స్పీడ్ కంట్రోల్ కాకపోవటంతోనే ఆర్టీసీ బస్సును ఢీకొట్టి ఉండవచ్చని భావిస్తున్నారు. ఎదురుగా వచ్చిన టిప్పర్ లారీ.. ఆర్టీసీ బస్సు కుడి వైపు డ్రైవర్ సీటును చీల్చుకుంటూ వెళ్లింది. బస్సు రైట్ సైట్ సగం వరకు టిప్పర్ పడిపోయింది. అయితే ఆ సమయంలో లారీలో దాదాపు 15 నుంచి 20 టన్నుల వరకు కంకర ఉండగా.. అది పూర్తిగా బస్సులోని ప్రయాణికులపై పడిపోయింది. దీంతో కుడి వైపు కూర్చున్న ప్రయాణికులు కంకరలో కూరుకుపోయి ప్రాణాలు కోల్పోయారు. ఈ కారణంతోనే మఅతుల సంఖ్య పెరిగిందని పోలీసులు చెబుతున్నారు.బస్సులో ఎడమ వైపు సీట్లలో కూర్చున్న ప్రయాణికులు ప్రాణాలు కాపాడుకోగలిగారు. వారు కూడా సగం వరకు కంకరలో కూరుకుపోగా.. పోలీసులు జేసీబీల సాయంతో కంకరను పక్కకు తొలగించి వారిని రక్షించారు. అనంతరం అంబులెన్సుల్లో చేవెళ్ల ఆసుపత్రికి తరలించారు. మృతుల్లో ఎక్కువగా మహిళలే ఉన్నట్లు తెలుస్తోంది. అయితే వారి (తరువాయి 2వ పేజీలో)

## లండన్ లో 'ఆక్టోపస్ ఎనర్జీ' ప్రతినిధులతో

# చంద్రబాబు కీలక సమావేశం



**లండన్:** ఆంధ్రప్రదేశ్‌కు పెట్టుబడుల ఆకర్షణే లక్ష్యంగా ముఖ్యమంత్రి చంద్రబాబు లండన్ పర్యటనలో పారిశ్రామికవేత్తలతో సమావేశమవుతున్నారు. ఈ పర్యటనలో భాగంగా, ఆయన లండన్‌లోని అతిపెద్ద విద్యుత్ సరఫరా సంస్థ అయిన ఆక్టోపస్ ఎనర్జీ ఇంటర్నేషనల్ ప్రతినిధులతో భేటీ అయ్యారు. రాష్ట్రంలో పునరుత్పాదక ఇంధన రంగంలో పెట్టుబడులు పెట్టాలని వారిని ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆక్టోపస్ ఎనర్జీ ఇంటర్నేషనల్ డైరెక్టర్ క్రిస్ ఫిట్జార్డ్ తో ఆయన ప్రత్యేకంగా సమావేశమయ్యారు. పునరుత్పాదక విద్యుత్ రంగంలో ఆంధ్రప్రదేశ్‌లో పెట్టుబడులు పెట్టాలని ఈ సంస్థను సీఎం ఆహ్వానించారు. ముఖ్యంగా అమరావతి, విశాఖపట్నం వంటి నగరాల్లో నూతన టెక్నాలజీ ద్వారా విద్యుత్ సరఫరా, నియంత్రణ రంగంలో కలిసి పనిచేసేందుకు అపార అవకాశాలు ఉన్నాయని చంద్రబాబు వివరించారు.

క్లీన్ ఎనర్జీ, స్మార్ట్ గ్రిడ్, డేటా అనలిటిక్స్ వంటి ఆధునిక రంగాల్లో ఏపీలో పెట్టుబడులకు అనువైన వాతావరణం ఉందని స్పష్టం చేశారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పునరుత్పాదక ఇంధనానికి అధిక ప్రాధాన్యత ఇస్తోందని, రాష్ట్రంలో 160 గిగావాట్ల గ్రీన్ ఎనర్జీని ఉత్పత్తి చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నామని ముఖ్యమంత్రి వారికి తెలిపారు. విద్యుత్ రంగంలో ప్రభుత్వం అనుసరిస్తున్న పారిశ్రామిక విధానాలు, లక్ష్యాలను ఆయన వారికి వివరించారు.రాష్ట్రానికి వచ్చి క్షేత్రస్థాయిలో పరిస్థితులను పరిశీలించి, పెట్టుబడులు పెట్టాలని చంద్రబాబు ఆక్టోపస్ ఎనర్జీ ప్రతినిధులను కోరారు.

# ఆలయాల్లో భద్రతపై పవన్ కీలక ఆదేశాలు



**అమరావతి, పతాకం న్యూస్:** పవిత్ర కార్తీక మాసం సందర్భంగా రాష్ట్రంలోని ప్రముఖ ఆలయాలకు భక్తుల తాకిడి పెరుగుతున్న నేపథ్యంలో, కాకినాడ జిల్లా పరిధిలోని పుణ్యక్షేత్రాల్లో భక్తుల భద్రత, సౌకర్యాలపై ప్రత్యేక దృష్టి సారించాలని డిప్యూటీ ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ జిల్లా యంత్రాంగాన్ని ఆదేశించారు. క్యూ లైన్ల నిర్వహణ, పారిశుద్ధ్యం, భద్రతా ఏర్పాట్లలో ఎలాంటి లోటుపాట్లకు తావులేకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. భక్తులకు ఎక్కడా అసౌకర్యం కలగకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందని స్పష్టం చేశారు. సోమవారం మధ్యాహ్నం కాకినాడ జిల్లా కలెక్టర్, ఎస్పీ సహా వివిధ శాఖల ఉన్నతాధికారులతో పవన్ కల్యాణ్ సమీక్ష నిర్వహించి, పలు కీలక సూచనలు చేశారు. ముఖ్యంగా జిల్లాలోని ప్రముఖ శైవ క్షేత్రాలైన సామర్లకోట కుమార (తరువాయి 2వ పేజీలో)

## నెల్లూరు జైలుకు జోగి రమేశ్ తరలింపు



**విజయవాడ, పతాకం న్యూస్:** నకిలీ మద్యం కేసులో అరెస్టయిన మాజీ మంత్రి, వైసీపీ నేత జోగి రమేశ్, ఆయన సోదరుడు రాముకు న్యాయస్థానం 10 రోజుల రిమాండ్ విధించింది. ఈ నెల 13వ తేదీ వరకు వారికి జ్యుడీషియల్ రిమాండ్ విధిస్తూ న్యాయమూర్తి ఈ తెల్లవారుజామున ఆదేశాలు జారీ చేశారు. కోర్టు ఆదేశాల మేరకు తొలుత విజయవాడ జైలుకు వారిని తరలించారు. అనంతరం నెల్లూరు జైలుకు మార్చారు. ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్నంలో జోగి రమేశ్‌ను సిట్ అధికారులు అదుపులోకి తీసుకున్న విషయం తెలిసిందే.

## సమర్థ నాయకత్వం ఉన్న ఏకైక రాష్ట్రం ఏపీ: లోకేశ్

2లో





పతాకం న్యూస్

APTEL/25/A2082

PATHAKAM NEWS TELEGU DAILY / తెలుగు దినపత్రిక

ధర్మం కోసం పోరాటం చేస్తున్నా..

అవినీతి, అక్రమాలను బయటకు తీస్తున్నా..

పతాకం న్యూస్‌కు సహకరించగలరు

సంవత్సరం చందా రూ. 2000

PATHAKAM NEWS

State Bank of India

A/c No: 44576280686

IFSC:SBIN00021297

DUVVADA BRANCH

పతాకం న్యూస్
APTEL/25/A2082
PATHAKAM NEWS TELEGU DAILY
తెలుగు దినపత్రిక

# సంపాదకీయం

## నిలిపివేత

రష్యా ముడి చమురు దిగుమతుల్లో అమెరికా అధ్యక్షుడు గత కొంత కాలంగా చెబుతున్నదే మన దేశంలో నిజమవుతున్నది. రష్యా చమురు కొనుగోలు నిలిపివేస్తున్నట్లు ప్రధాని మోడీ తనకు హామీ ఇచ్చారని, త్వరలో అది అమలవుతుందని గత కొన్ని వారాలుగా ట్రంప్ పదేపదే ప్రకటించాడు. అవునని అంగీకరించక, కాదని తిరస్కరించక దేశ ప్రజలతో దోబూచులాడిన కేంద్ర బిజెపి ప్రభుత్వం ఎట్టకేలకు ట్రంప్ ఒత్తిళ్లకు తలొగ్గి రష్యా ముడి చమురు దిగుమతులను నిలిపివేసింది. ప్రభుత్వ ఆయిల్ కంపెనీలు రష్యాతో చేసుకున్న పాత ఒప్పందాలను రద్దు చేసుకున్నాయి. మన దేశానికి ఆయిల్‌తో బయలుదేరిన పడవలను మన పాలకులు ట్రంప్ కరుణాకటాక్షాల కోసం సముద్ర మధ్య నుండే రష్యాకు వెనక్కి పంపించివేశారు. ఒకవైపు చైనాపై 10 శాతం సుంకాన్ని తగ్గిస్తున్నట్లు ప్రకటించిన ట్రంప్ మరోవైపు మన దేశ పాలకులపై ఇంతగా ఒత్తిడి తేవడానికి కారణం ఏమిటి? ప్రపంచంలో ఏ దేశాధినేత కంటే అధికంగా ట్రంప్‌ను కీర్తించింది మన ప్రధానే కదా! అయినా మన దేశం మీద ట్రంప్ బెదరింపులు ఏమిటీ? అందుకు స్వప్రకటిత 'దేశభక్త' పాలకులు ఇంతగా ఎందుకు సాగిలపడుతున్నారు? అమెరికా ఒత్తిళ్లకు లొంగిపోతే అది కేవలం రష్యా చమురుకే పరిమితం కాదు, మన దేశ వ్యవసాయ రంగంలోకి అమెరికా కంపెనీల ప్రవేశం వరకు కొనసాగే అవకాశం ఉంది. ఇది మన దేశ ఆర్థిక వ్యవస్థతో పాటు మన సార్వభౌమత్వానికే అత్యంత ప్రమాదం. అమెరికా ఆర్థిక వ్యవస్థ గత కొన్ని సంవత్సరాలుగా తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నది. లాభాల వేటలో భాగంగా ఆ దేశ పెట్టుబడిదారులు ఉత్పాదక రంగం నుండి సేవా రంగానికి మళ్ళారు. వెనుకబడిన దేశాల కార్మికులతో చౌకగా పనిచేయించుకుని భారీగా లాభపడ్డారు. దీనివల్ల అమెరికాలో నిరుద్యోగం, ఆర్థిక అసమానతలు పెరిగాయి. ఈ సమస్యలన్నింటికీ మూలం ఆ దేశం అనుసరించిన పెట్టుబడిదారీ ఆర్థిక విధానంలో వుంది. జబ్బు ఒకటైతే మందు మరొకటి అన్నట్లు ప్రపంచంపై తన ఆధిపత్యం కొనసాగించడం ద్వారా తన కష్టాలను ప్రపంచంపై రుద్దడానికి ట్రంప్ ప్రయత్నిస్తున్నాడు. అన్ని దేశాలు తాను చెప్పినట్లు, చెప్పిన సమయంలో వాణిజ్య ఒప్పందాలు చేసుకోవాలంటూ బెదిరించాడు. అందుకు సిద్ధపడని దేశాలపై టారిఫ్ టెర్రరిజాన్ని ప్రకటించాడు. ఈ దెబ్బతో అన్ని దేశాలు తమ ముందు మోకరిల్లుతాయని ట్రంప్ ఆశించాడు. కానీ చైనా, బ్రెజిల్, మెక్సికో లాంటి అనేక దేశాలు తమ సార్వభౌమత్వాన్ని కాపాడుకుంటూ అమెరికా ఒత్తిళ్లను ప్రతిఘటించాయి. అమెరికా తమ సరుకులపై ఎంత పన్ను విధిస్తే, అంతే పన్ను మేము విధిస్తామని చైనా, బ్రెజిల్ లాంటి దేశాలు ప్రకటించాయి. చైనా మార్కెట్‌ను కాదని అమెరికా కంపెనీలు బతికే పరిస్థితి లేదు. అందుకే ట్రంప్‌పై ఒత్తిడి తెచ్చి చైనాతో ఒప్పందాలు చేయించుకున్నాయి. తాజాగా చైనాపై 10 శాతం సుంకాన్ని తగ్గిస్తున్నట్లు అమెరికా అధ్యక్షుడు ప్రకటించాల్సి వచ్చింది. ఈ పరిస్థితుల్లో అత్యధిక జనాభా కలిగి, అతి పెద్ద ఆర్థిక వ్యవస్థగా వున్న మన దేశం మరింత దృఢంగా అమెరికా ఒత్తిళ్లను ఎదిరించాలని దేశ ప్రజలు కోరుకుంటారు. అయితే మన పాలకుల తీరు అందుకు పూర్తి భిన్నంగా వుంది. ఇప్పటికే మన దేశ ఎగుమతులపై 50 శాతం సుంకాలను పెంచి చిన్న, మధ్యతరహా పరిశ్రమలను ట్రంప్ దెబ్బతీశాడు. సినిమా, మందుల పరిశ్రమలపై వంద శాతం సుంకం వేశాడు. ఇంత ఏకపక్షంగా వ్యవహరిస్తున్న అమెరికాతో వాణిజ్య చర్చలు జరిపేందుకు సానుకూల పరిస్థితులను సృష్టించేందుకని అమెరికా పత్తిపై 10 శాతం మాత్రమే సుంకాలు వేసేందుకు మోడీ ప్రభుత్వం అంగీకరించింది. ఇది ఇంతటితోనే ఆగదు. వ్యవసాయం, పాడి, పౌల్ట్రీ, మత్స్య రంగాల్లోకి అమెరికా కంపెనీలకు ద్వారాలు తెరిచే ప్రయత్నాలు జరుగుతున్నాయి. రష్యా ముడి చమురు చౌకగా కొని భారీగా లాభపడిన మన దేశ కార్పొరేట్ కంపెనీలు, తమ పెట్టుబడిని అమెరికా ఆశీస్సులతో విస్తరించుకోవాలని ప్రయత్నిస్తున్నాయి. అందులో భాగంగా రష్యా చమురు దిగుమతుల నిలిపివేయడానికి మోడీ ప్రభుత్వం సిద్ధపడింది. 2018-2022 మధ్య మన దేశ చమురు అవసరాల్లో 17 శాతం ఇరాన్, వెనిజులా నుండి దిగుమతి అయ్యేది. రష్యా, ఇరాక్, సౌదీ అరేబియా, యుఎఇ, బ్రెజిల్, అమెరికా, కువైట్, మెక్సికో, నైజీరియా దేశాల నుండి సుమారు 50 శాతం వచ్చేది. 2022 ఫిబ్రవరిలో రష్యా ఉక్రెయిన్ మధ్య యుద్ధం ప్రారంభమైన తర్వాత ఈ పరిస్థితి మారిపోయింది.

## వక్ఫ్ ఆస్తులపై అసదుద్దీన్ పిటిషన్ విచారణకు అంగీకరించిన సుప్రీంకోర్టు



**న్యూఢిల్లీ, పతాకం న్యూస్:** వక్ఫ్ ఆస్తుల రిజిస్ట్రేషన్ గడువును పొడిగించాలంటూ ఎఐఎంఐఎం అసదుద్దీన్ ఒవైసీ దాఖలు చేసిన పిటిషన్ విచారణకు సుప్రీంకోర్టు సోమవారం అంగీకరించింది. విచారణ తేదీ ప్రకటిస్తామని భారత ప్రధాన న్యాయమూర్తి (సిజెఐ) బి.ఆర్.గవారు, జస్టిస్ కె.వినోద్ చంద్రన్‌లతో కూడిన ధర్మాసనం పేర్కొంది. యుమీద్ పోర్టల్ కింద యూజర్ బై వక్ఫ్ తో సహా అన్ని వక్ఫ్ ఆస్తులను తప్పనిసరి రిజిస్ట్రేషన్ చేయడానికి సమయం పొడిగించాలని కోరుతూ అసదుద్దీన్ సహా పలువురు పిటిషన్లు దాఖలు చేసిన సంగతి తెలిసిందే. ఈ విషయాన్ని ముందస్తు తేదీన విచారించకపోవడంతో అత్యవసరంగా విచారించాలని ఒవైసీ తరపున వాదిస్తున్న న్యాయవాది నిజాం పాషా తెలిపారు. వక్ఫ్ తప్పనిసరి రిజిస్ట్రేషన్ కోసం ఆరునెలల గడువు ముగింపు దశకు చేరుకుందని అన్నారు. ఈ అంశంపై అసదుద్దీన్, ఇతరుల పిటిషన్‌లను అక్టోబర్ 28న విచారణకు ధర్మాసనం ముందుగా జాబితా చేసింది. అయితే వాటిని విచారణకు స్వీకరించలేకపోయింది. కొత్తగా సవరించిన చట్టంలోని 'వక్ఫ్ బై యూజర్' నిబంధనను తొలగించాలని కేంద్రం జారీ చేసిన ఆదేశం ప్రాథమికంగా ఏకపక్షం కాదని, కానీ వక్ఫ్ భూములను అక్రమంగా ప్రభుత్వాలు స్వాధీనం చేసుకునే అవకాశం ఉందని పిటిషన్ పేర్కొంది. సవరించిన చట్టంలోని వక్ఫ్ ఆస్తుల రిజిస్ట్రేషన్ కోసం ఆరునెలల గడువు ఇచ్చారని, తీర్పు వెలువడే సమయానికి ఐదు నెలలు గడిచాయని, ఇప్పుడు ఒక్క నెల మాత్రమే మిగిలి వుందని న్యాయవాది నిజాం పాషా పేర్కొన్నారు. అన్ని వక్ఫ్ ఆస్తులను జియో-ట్యాగింగ్, డిజిటల్ జాబితాను రూపొందించడానికి జూన్ 6న కేంద్రం ఏకీకృత వక్ఫ్ నిర్వహణ, సాధికారత, సామర్థ్యం మరియు అభివృద్ధి(ఉమీద్) చట్టం కేంద్ర పోర్టల్‌ను ప్రారంభించింది. ఉమీద్ పోర్టల్ ఆదేశం ప్రకారం, భారతదేశవ్యాప్తంగా నమోదైన అన్ని వక్ఫ్ ఆస్తుల వివరాలను ఆరునెలల్లోపు తప్పనిసరిగా అప్‌లోడ్ చేయాల్సి వుంది.

## నైతిక- మానవ కేంద్రీకృత ఎఐ కోసం భారత్ ప్రయత్నిస్తోంది : మోడీ



**న్యూఢిల్లీ, పతాకం న్యూస్:** : నైతిక, మానవ-కేంద్రీకృత కృత్రిమ మేధస్సు (ఎఐ) కోసం ప్రపంచ చట్రాన్ని రూపొందించడంలో భారత్ కీలక పాత్ర పోషిస్తున్నదని ప్రధాని మోడీ అన్నారు. సోమవారం ఢిల్లీలో జరిగిన ఎమర్జింగ్ సైన్స్, టెక్నాలజీ అండ్ ఇన్నోవేషన్ కాన్‌క్లేవ్ (ఇఎస్‌టిఐసి) 2025ను ఉద్దేశించి ఆయన ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన సమాజంలోని ప్రతి వర్గానికి ఎఐ అందుబాటులోకి, ప్రయోజనకరంగా ఉండేలా తమ ప్రభుత్వం కృషి చేస్తోందని చెప్పారు. కాగా, నేడు ఎఐ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్)ని ఇప్పుడు అంతటా ఉపయోగిస్తున్నారు. రిటైల్ నుండి లాజిస్టిక్స్ వరకు కస్టమర్ సేవ నుండి పిల్లల హోం వర్క్ వరకు ఇలా అన్నిచోట్లా ఉపయోగిస్తున్నారు. అందువల్ల ఎఐని సమాజంలోని ప్రతి వర్గానికి ఉపయోగకరంగా మేము కృషి చేస్తున్నాము. ఇండియా ఎఐ మిషన్ కోసం పదివేల కోట్లకు పైగా పెట్టుబడులు పెట్టాం. 2026 ఫిబ్రవరిలో గ్లోబల్ ఎఐ సమ్మిట్‌ను భారత్ నిర్వహిస్తోంది. అప్పుడు సమ్మిళిత, నైతిక, మానవ కేంద్రీకృత ఎఐ కోసం భారత్ కీలక ప్రయత్నాలు చేస్తుంది. ఇప్పుడు కూడా ఆవిధమైన ప్రయత్నాలను భారత్ చేస్తోంది. ఈ విధమైన ప్రయత్నాలు రాబోయే ఎఐ గవర్నెన్స్‌కు ముందడుగు. ఎఐ ద్వారా రూపొందించే కొత్త కొత్త ఆవిష్కరణలతోపాటు, వాటి భద్రతకు సంబంధించిన వాటిని అభివృద్ధి చేసుకోవడం వంటివి లక్ష్యాలుగా ఉండాలి అని ఆయన సలహానిచ్చారు.

గత దశాబ్దకాలంగా సైన్స్ అండ్ టెక్నాలజీ రంగంలో మహిలలు భాగస్వామ్యం పెరిగింది. మనం భారత అంతరిక్షం గురించి మాట్లాడుకునేటప్పుడు భారతీయ మహిళా శాస్త్రవేత్తల గురించి తప్పక ప్రస్తావిస్తాము. పేటెంట్ దాఖలులో దశాబ్దం క్రితం ఈ రంగంలో ఏటా మహిళల సంఖ్య వంద కంటే తక్కువగా ఉండేది. ఇప్పుడు అది ఏటా 5,000లకు పైగా చేరుకుంది. సైన్స్ అండ్ టెక్నాలజీ ఇంజనీరింగ్ మెడిసిన్ (ఎస్‌టిఇఎం) విద్యలో మహిళల వాటా దాదాపు 43 శాతంగా ఉంది. ఇది ప్రపంచ సగటు కంటే ఎక్కువ అని మోడీ నొక్కి చెప్పారు. భారతదేశంలో అమ్మాయిలు శాస్త్ర సాంకేతిక రంగంలో ఉన్నారా? అని ఒక అభివృద్ధి చెందిన సైన్స్ అండ్ టెక్నాలజీ మంత్రి నన్ను అడిగారు. ఈ ప్రశ్నకు భారత్ మహిళా శాస్త్రవేత్తల సంఖ్య గురించి చెప్పగానే.. ఆయన ఆశ్చర్యపోయారు. ఇదీ భారతదేశ పుత్రికలు సాధించిన విజయం అని మోడీ గర్వంగా చెప్పారు.

## 19 మంది మృతి

(మొదటిపేజీ తరువాయి)



పూర్తి వివరాలు వెల్లడి కావాల్సి ఉంది. గాయపడిన వారిలో పరిస్థితి విషమంగా ఉన్న వారిని హైదరాబాద్‌లోని నిమ్స్, గాంధీ హాస్పిటల్స్‌కు తరలించారు. బస్సు ప్రమాద ఘటనపై సిఎం రేవంత్ రెడ్డి విచారం వ్యక్తం చేశారు. తక్షణం ఘటనా స్థలానికి చేరుకొని, అవసరమైన సహాయక చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ప్రమాదానికి సంబంధించిన పూర్తి వివరాలు ఎప్పటికప్పుడు తెలియజేయాలని అధికారులకు సూచించారు. చేవెళ్ల బస్సు ప్రమాద ఘటనపై బాధిత కుటుంబ సభ్యులకు సమాచారం అందించడం కోసం, సహాయం కోసం సచివాలయంలో ప్రత్యేకంగా కంట్రోల్ రూమును ఏర్పాటు చేశారు. బాధితులు 9912919545 లేదా 9440854433 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

## సమర్థ నాయకత్వం ఉన్న ఏకైక రాష్ట్రం ఏపీ: లోకేశ్




**ఉండవల్లి, పతాకం న్యూస్:** యువతకు ఉపాధి కల్పిస్తే అన్ని సమస్యలూ పరిష్కారమవుతాయని ఏపీ మంత్రి నారా లోకేశ్ అన్నారు. కూటమి ప్రభుత్వ హయాంలో 20 లక్షల ఉద్యోగాలు కల్పిస్తామని హామీ ఇచ్చామని, అందుకోసం పోటీపడి పని చేస్తున్నామని చెప్పారు. ఉండవల్లిలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. గత 16 నెలల్లో రూ.10 లక్షల కోట్ల పెట్టుబడులు పెట్టేందుకు పలు సంస్థలు ముందుకొచ్చాయన్నారు. స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ వల్ల ఏపీకి పెట్టుబడుల వెల్లువ సాధ్యమవుతోందని చెప్పారు. అనకాపల్లిలో అర్సెల్లార్ మిత్తల్ రూ.1.5 లక్షల కోట్లు, విశాఖలో గూగుల్ 15 బిలియన్ డాలర్ల పెట్టుబడి పెట్టబోతున్నట్లు చెప్పారు.

"దేశ ఎఫ్‌డిఐ చరిత్రలో అతిపెద్ద పెట్టుబడి గూగుల్ పెట్టబోతోంది. నెల్లూరులో బీపీసీఎల్ రూ. లక్ష కోట్ల పెట్టుబడులు పెడుతోంది. ఎన్టీపీసీ రూ.1.60 లక్షల కోట్లు పెట్టుబడులు పెడుతోంది. స్వదేశీ పెట్టుబడుల సాధనలో ఏపీ ప్రథమ స్థానంలో ఉంది. పెట్టుబడుల ఆకర్షణకు స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ తీసుకొచ్చాం. పోటీపడి పెట్టుబడులు సాధిస్తున్నాం. అనుభవం, సమర్థ నాయకత్వం ఉన్న ఏకైక రాష్ట్రం ఆంధ్రప్రదేశ్. అర్సెల్లార్ మిత్తల్ పెట్టుబడుల కోసం ప్రధాని మోదీని చంద్రబాబు 2 సార్లు కలిశారు. నవంబర్ 14, 15 తేదీల్లో విశాఖలో నిర్వహించబోయే సీఐఐ సమ్మిట్కు పలువురు కేంద్ర మంత్రులు, పారిశ్రామిక వేత్తలు వస్తున్నారు. 45 దేశాల నుంచి 300 మంది పారిశ్రామిక వేత్తలు వస్తున్నారు. 410కి పైగా ఒప్పందాలు జరగనున్నాయి. ఇన్వెస్టర్లు, ప్రభుత్వం, ప్రజలు కలిస్తేనే.. ఏపీని అగ్రస్థానంలో నిలబెట్టగలం. 120 బిలియన్ డాలర్ల పెట్టుబడులతో ఆగిపోవట్లేదు.. ఇంకా సాధించాలి" అని నారా లోకేశ్ అన్నారు. కులం, మతం పేరిట వైకాపా విద్వేషాలు రెచ్చగొడుతోంది. గూగుల్ పెట్టుబడులపై వైకాపా నేతలు దుష్ప్రచారం చేశారు. విశాఖలో చెట్లు పెరగవని అక్కడి ప్రజలను రెచ్చగొట్టే ప్రయత్నం చేశారు. పెట్టుబడులకు వైకాపా నేతలు సిఫార్సు చేసినా అంగీకరిస్తాం. రాష్ట్రాభివృద్ధి కోసం ముందుకొస్తే.. కలిసికట్టుగా ముందుకెళ్లాం. ఎన్నికలొచ్చినప్పుడే రాజకీయాలు.. ఆ తర్వాత రాష్ట్రాభివృద్ధే మన ధ్యేయం కావాలి" అని లోకేశ్ అన్నారు.

## జోగి రమేశ్‌కు సహకరిస్తే పోలీసులపైనా చర్యలు: మంత్రి కొల్లు రవీంద్ర హెచ్చరిక



**అమరావతి, పతాకం న్యూస్:** కల్తీ మద్యం కేసులో వైసీ పీ నేత జోగి రమేశ్‌ను పూర్తి ఆధారాలతోనే పోలీసులు అరెస్టు చేశారని రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర స్పష్టం చేశారు. ప్రభుత్వాన్ని అస్థిరపరిచే కుట్రలో భాగంగానే జోగి రమేశ్ నకిలీ మద్యం తయారు చేయించారని ఆయన తీవ్ర ఆరోపణలు చేశారు. ఈ కేసులో అన్ని ఆధారాలూ సేకరించిన తర్వాతే చట్టపరమైన చర్యలు తీసుకున్నామని తెలిపారు. మంత్రి కొల్లు రవీంద్ర సోమవారం మీడియాతో మాట్లాడుతూ... జోగి రమేశ్‌కు, మరో నిందితుడైన జనార్దనరావుకు మధ్య ఉన్న సంబంధం అందరికీ తెలిసిందేనని అన్నారు. జనార్ధనరావు నేరుగా జోగి రమేశ్ ఇంటికి వెళ్లినట్లు నిర్ధారించే సీసీటీవీ ఫుటేజ్ కూడా తమ వద్ద ఉందని ఆయన వెల్లడించారు. బీసీల గురించి మాట్లాడే నైతిక అర్హత జోగి రమేశ్‌కు ఏమాత్రం లేదని విమర్శించారు. ఈ కేసు దర్యాప్తు విషయంలో ఎవరూ జోక్యం చేసుకోవద్దని మంత్రి హెచ్చరించారు. ఒకవేళ పోలీసు శాఖలో ఎవరైనా అధికారులు ఉద్దేశపూర్వకంగా జోగి రమేశ్‌కు అనుకూలంగా వ్యవహరించినా, కేసును తప్పుదోవ పట్టించాలని ప్రయత్నించినా వారిపై కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. ప్రభుత్వం ఈ విషయాన్ని అత్యంత సీరియస్‌గా తీసుకుందని, దోషులు ఎవరైనా వదిలిపెట్టే ప్రసక్తే లేదని ఆయన తేల్చిచెప్పారు.

## ఆలయాల్లో భద్రతపై పవన్ కీలక ఆదేశాలు

(మొదటిపేజీ తరువాయి)

భీమేశ్వరస్వామి ఆలయం, పిఠాపురం శ్రీపాద శ్రీవల్లభ క్షేత్రం, అన్నవరం శ్రీ వీరవెంకట సత్యనారాయణ స్వామి ఆలయాలకు కార్తీక మాసంలో భక్తులు భారీ సంఖ్యలో వస్తారని, ఈ రద్దీని దృష్టిలో ఉంచుకొని ముందస్తు ఏర్పాట్లు పూర్తి చేయాలని దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ మాట్లాడుతూ, "కాశీబుగ్గ ఘటనను దృష్టిలో ఉంచుకొని దేవాదాయ శాఖ ఆలయాల వద్ద తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. జిల్లాలోని ప్రసిద్ధ క్షేత్రాలతో పాటు ప్రైవేట్ సంస్థల ఆధ్వర్యంలో నడుస్తున్న ఆలయాల జాబితాను కూడా సిద్ధం చేసి, వాటి వద్ద రద్దీని పర్యవేక్షించాలి" అని అధికారులను ఆదేశించారు. ఈ నెల 5వ తేదీన కార్తీక పౌర్ణమి ఉన్నందున ఆ రోజు, ఆ తర్వాత రోజుల్లో రద్దీ అనూహ్యంగా పెరిగే అవకాశం ఉందని అంచనా వేసుకోవాలన్నారు. ముఖ్యంగా శని, ఆది, సోమవారాల్లో భక్తుల సంఖ్య భారీగా ఉంటుందని తెలిపారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా దేవాదాయ, పోలీసు, పంచాయతీరాజ్, మున్సిపల్, రెవెన్యూ శాఖలు సమన్వయంతో పనిచేయాలని పవన్ కల్యాణ్ సూచించారు. "భక్తుల రద్దీకి అనుగుణంగా క్యూ లైన్లు ఏర్పాటు చేయాలి. ఆలయ పరిసరాలు, క్యూ లైన్ల వద్ద సీసీ కెమెరాలతో నిరంతర పర్యవేక్షణ ఉండాలి. తాత్కాలిక మరుగుదొడ్లు ఏర్పాటు చేయడంతో పాటు, ఎప్పటికప్పుడు చెత్తను తొలగించి పారిశుధ్యాన్ని కాపాడాలి. రద్దీకి తగినట్లు ఏపీఎస్ఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడపాలి. ఆలయాల సమీపంలోని జాతీయ రహదారులపై ట్రాఫిక్‌ను నియంత్రిస్తూ ప్రమాదాలు జరగకుండా చూడాలి. రద్దీ ఎక్కువగా ఉండే రోజుల్లో వైద్య శిబిరాలను కూడా ఏర్పాటు చేయాలి" అని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.

# చోడవరం ప్రెస్ క్లబ్ ఏపీడబ్ల్యూజేఎఫ్ సభ్యుల ఔదార్యం



**చోడవరం, పతాకం న్యూస్:** మీడియా రంగంలో తన తోటి మిత్రులైన సీనియర్ పాత్రికేయులు చీడికాడ మండలానికి చెందిన నీలగిరి వార్త రిపోర్టర్ కుమార్ భార్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందడంతో ఆయన ఆర్థిక పరిస్థితిని దృష్టిలో ఉంచుకొని సాటి మీడియా మిత్రునికి తమ వంతు సహాయం గా తోడ్పాటు అందించాలని కృత నిశ్చయంతో అనకాపల్లి జిల్లా ఏపీడబ్ల్యూజేఎఫ్ జిల్లా ప్రెసిడెంట్ బీమర శెట్టి వెంకటేష్ చేతుల మీదుగా చోడవరం ప్రెస్ క్లబ్ ఏపీడబ్ల్యూజేఎఫ్ యూనియన్ సభ్యులు 11 వేల రూపాయలు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ లీడర్స్ శరగడం రాజు, ఉండా తాతారావు తోపాటు యూనియన్ సభ్యులు కొత్తూరు వాసు, కోన తలుపుల నాయుడు, సానబోయిన గోవిందా, కరక అప్పలనాయుడు, అల్లం గోవిందా, అయితే గంగరాజు, మీసాల మోహన్, వియ్యపు గోవింద, కిల్లి నాగరాజు, అజయ్ ప్రసాద్, కె ఎం నాయుడు , రవి, కళ్యాణ్ తోపాటు పలువురు పాల్గొన్నారు.

## మొంథా తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించిన 'మళ్ల'





**గాజువాక, పతాకం న్యూస్ :** విశాఖ పశ్చిమ నియోజకవర్గ, మల్కాపురం మొంథా తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త మాజీ శాసనసభ్యులు డాక్టర్ మళ్ళ విజయప్రసాద్ పర్యటించారు. మొంథా తుఫాన్ వలన తీవ్ర ఇబ్బంది పడిన 40వ వార్డు రాజీవ్ కాలనీ (ఏకేసీ కాలనీ) గ్రామంలో మాజీ శాసనసభ్యులు పశ్చిమ ఇంచార్జ్ విజయ ప్రసాద్ మాట్లాడుతూ తుఫాన్ వలన నష్టం కలిగిన రాజీవ్ కాలనీ రేకుల సెట్లు ప్రాంతాల్లో ప్రభుత్వం తక్షణం ఆదుకోవాలని, వారికి అన్ని విధాల సహాయ సహకారాలు అందించాలని ఈ విషయం పై సంబంధిత అధికారులతో మాట్లాడతామని మళ్ళా అన్నారు,ఈ నీటి ముంపుకి ప్రధాన కారణం మెయిన్ రోడ్డుపై ఉన్న కల్వర్టు పైపులైనుతో కేబుల్ తో నిండిపోయి చెత్తంతా జాము అవడంతో నీరూంతా రోడ్డుపై ప్రవహించి కాలనీలోకి చొరబడందీని దీని వల్ల తీవ్ర ఇబ్బంది పడ్డారు అని అన్నారు ఇప్పుడు చేస్తున్న పనులు శాశ్వతం కాదని ఏదో నాలుగు రోజులు తూతూ మంత్రంగా చేసి పూర్తి అయిపోయింది అని చెప్పుకోవడం చాలా తప్పు అని ఇది పునర్వృతం కాకుండా శాశ్వత పరిష్కారం చూపాలని తెలిపారు, టిడిపి ప్రభుత్వం తూతు మంత్ర పరిష్కారం తప్ప, శాశ్వతమైన పరిష్కారం చూపడం లేదని రాజకీయ డ్రామాల అడటం,అక్రమ కేసులు పెట్టి డైవెర్ట్ రాజకీయాలు చేస్తున్నారు అని మళ్ళ అన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు కార్పొరేటర్ గుండపు నాగేశ్వరరావు వైసీపీనాయకులు మిశ్రా, శ్యామ్, సూరి, కిషోర్, ప్రకాష్, మోహన్, సందీప్, సురేష్, వేణు, కృష్ణ, సూరిబాబు, శ్రీను, మురళి, కే రమేష్, జే రమేష్, ధర్మ, శివ, రామునాయుడు, గణేష్, శ్యామ్ బెహరా, కాలనీ మహిళలు తదితరులు పాల్గొన్నారు ఈ విధంగా మళ్ల విజయప్రసాద్ ఆధ్వర్యంలోని ప్రభుత్వ మెడికల్ కళాశాలలు ప్రవేట్ పరం అవకుండా ఉండడం కోసం కూటమి తప్పిదాలుపై ఏకేసి కాలనీలో మాజీ సీఎం జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు కోటి సంతకాల సేకరణ చేశారు. ఈ కార్యక్రమంలో వార్డ్ కార్పొరేటర్ గుండపు నాగేశ్వరరావు అధ్యక్షతన కార్యక్రమం నిర్వహించారు

## నూతన ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ



**పరవాడ, పతాకం న్యూస్ :** పరవాడ మండలం, పెదముషిడివాడ పంచాయతీలో నలుగురు వితంతువులకు కూటమి ప్రభుత్వం నూతన ఎన్టీఆర్ భరోసా పింఛన్ల మంజూరు చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ పల్లా నాగమణి, టిడిపి ఎంపీటీసీ ఒమ్మి వెంకటరావు, పరవాడ మండల జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి కరణం నర్సింగరావు పాల్గొని ఈ నూతన పెన్షన్లను అందజేశారు. ఈ కార్యక్రమానికి పంచాయతీ సెక్రటరీ బి.రజిని, పరవాడ మండలం మాజీ టిడిపి అధ్యక్షుడు కోమటి వెంకట రమణ, పిల్లా అప్పారావు, బోండా అచ్చిబాబు, టిడిపి గ్రామ అధ్యక్షుడు ఒమ్మి అప్పారావు, బీజేపీ పరవాడ మండలం అధ్యక్షుడు పిళ్ళా సతీష్, మాజీ వార్డ్ మెంబర్ కన్నారావు, బలిరెడ్డి సతీష్, నీలికోండ హేమంత్, కూటమి కార్యకర్తలు పాల్గొన్నారు

## యువతకు వాలీబాల్ కిట్‌ల పంపిణీ



**అరకులోయ, పతాకం న్యూస్ :** స్థానిక ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం ఆదేశాల మేరకు మాదల పంచాయతీ తోటవలస గ్రామంలో యువతకు వాలీబాల్ కిట్‌ల పంపిణీ కార్యక్రమం జరిగింది.స్థానిక ఎంపీపీ ఆధ్వర్యంలో సూపర్ ఎంపీపీ జన్ని నరసింహామూర్తి, వైసీపీ మండల అధ్యక్షులు స్వాభి రామమూర్తి చేత ఈ కార్యక్రమం నిర్వహించబడింది.క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ఈ కార్యక్రమం ఏర్పాటు చేయబడింది. వైస్సార్సీపీ నాయకులు యువతను ప్రోత్సహిస్తూ, భవిష్యత్తులో మంచి స్థాయిలో ఎదగాలని, క్రీడల్లో పోటీపడి విజయాలు సాధించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో వైస్సార్సీపీ సీనియర్ నాయకులు పాంగి. నాగేశ్వరరావు, కొర్ర గురుమూర్తి, జన్ని సన్యాసి, కొర్ర రామారావు , గ్రామ యువత పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ప్రజా దర్బార్: అనిత



**నక్కపల్లి, పతాకం న్యూస్:** ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా హోంమంత్రి వంగలపూడి అనిత నక్కపల్లి ఎంపీడీవో కార్యాలయంలో ప్రజా దర్భార్ నిర్వహించారు. అర్జీదారులను నేరుగా కలిసి, ప్రతి ఒక్కరినీ పలకరిస్తూ, వారి సమస్యలను, వినతులు స్వీకరించారు. పాయకరావుపేట నియోజకవర్గం నాలుగు మండలాల నుంచి ప్రజలు వచ్చారు. ఈ గ్రీవెన్స్ కార్యక్రమానికి సుమారు 400కు పైగా అర్జీలు వచ్చాయన్నారు. భూమి సమస్యలు, ఫింఛన్లు,రేషన్ కార్డులు,హౌసింగ్,మత్స్యశాఖ విభాగాల్లో అధికంగా ఫిర్యాదులు వచ్చాయి. పరిష్కారానికి అవకాశం ఉన్న కొన్ని అంశాలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకువెళ్లి అక్కడికక్కడే పరిష్కరించారు.మరికొన్ని సమస్యలను పరిష్కాలంచాలని అధికారులను ఆదేశించారు.అంతకుముందు నక్కపల్లి ఎంపీడీవో కార్యాలయంలో స్వర్ణాంధ్రఏ2047 నియోజకవర్గ అభివృద్ధి యాక్షన్ ప్లాన్, పి ఫోర్ కేంద్రాన్ని మంత్రి అనిత ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో తాసిల్దార్ ఆర్ నరసింహమూర్తి, ఎంపీడీవో కందుకూరు సీతారామరాజు, తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ కన్వీనర్ కోప్పిశెట్టి వెంకటేష్, మండల పార్టీ అధ్యక్షుడు గింజల లక్ష్మణరావు తదితర నాయకులు పాల్గొన్నారు.

## గోడిచర్ల పాఠశాలలో స్కిల్స్ డే సెలెబ్రేషన్స్



**నక్కపల్లి, పతాకం న్యూస్:** నక్కపల్లి మండలం గొడిచెర్ల గ్రామంలోని జిల్లా పరిషత్ పాఠశాలలోని 9,10 తరగతుల విద్యార్థులకు ఒకేషనల్ ఎడ్యు కేషన్లో భాగంగా సోమవారం స్కిల్స్ డే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా ఎలక్ట్రానిక్స్ మరియు కంప్యూటర్ అభ్యశిస్తున్న విద్యార్థులు వర్కింగ్ మోడల్ ప్రాజెక్ట్స్ తయారుచేసారు,పాఠశాల ప్రధాన ఉపాధ్యాయులు సత్య కుమార్ మాట్లాడుతూ ఒకేషనల్ టెక్నికల్ కోర్సెస్ ద్వారా ఉన్నత ఉద్యోగ, ఉపాధి అవకాశాలు త్వరగా లభిస్తాయన్నారు. వృత్తి విద్య ఉపాధ్యాయులు యం. సాయి చందు, బి. లలిత పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## చింతపల్లి ప్రకృతి వ్యవసాయానికి మంచి ప్రాధాన్యత




**చింతపల్లి, పతాకం న్యూస్:** అల్లూరి జిల్లా జీకే వీధి మండలం కొత్తపాలెం గ్రామం లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వ్యవసాయ శాఖ చేపడుతున్న ఆర్ వై ఎస్ ఎస్ ఏపీ సి ఎన్ ఎఫ్ వినూత్న మైన వ్యవసాయ పద్ధతులను అనుసరిస్తున్న వంతల సూరిబాబు పొలం సందర్శించిన రాష్ట్ర ఎగ్జాక్యూటివ్ డైరెక్టర్ బాబురావు నాయుడు (ఐ ఏ ఎస్ ) మరియు జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ భాస్కర్. పొలం పరిశీలించిన బాబురావు నాయుడు మాట్లాడుతూ భవిష్యత్తు లో ఏపీ సి ఎన్ ఎఫ్ సంస్థ లో మరింతగా కొత్త కొత్తగా రైతులకు ఆదాయం వచ్చే దిశగా మారుతుందని రైతులందరు ప్రకృతి వ్యవసాయానికి మంచి ప్రాధాన్యత ఉందని ఇందుకోసం ప్రభుత్వం ముందు అడుగులు వేస్తుందని చెప్పుకొచ్చారు తరవాత మార్కెటింగ్ కోసం క్లుప్తంగా వివరించారు ఎన్ జి ఓ సంస్థ నుంచి గిరిజన వికాస్ సిబ్బంది మరియు ఏ పి సి ఎన్ ఎఫ్ జిల్లా సిబ్బంది కుమార్ బాబు సూరిబాబు రైతులు హాజరు అయ్యారు.

## జనసేన పార్టీలో నూతనసభ్యుల చేరిక



**చింతపల్లి, పతాకం న్యూస్:** గత వైసీపీ ప్రభుత్వం గెలుపు కోసం బలపం పంచాయతీ పరిధిలో విద్య వైద్య ఉపాధి అవకాశాలు రోడ్లు అందని మారుమూల గ్రామాల్లో వైసీపీ పార్టీ నిర్మాణం బలోపేతం కోసం అహర్నిశలతో ఎంతో కష్టపడి పని చేసిన గుర్తింపు లేకపోవడంతో జనసేన పార్టీలో చేరుతున్నామని పలువురు కార్యకర్తలు స్పష్టం చేశారు. మా మనసు కలిచివేస్తే ఆత్మాభిమానం చంపుకోలేక రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ జనసేన పార్టీ సిద్ధాంతాలు ఆశయాలు నచ్చి జనసేన పార్టీలో మా వార్డ్ సభ్యులతో వివిధ గ్రామాల గ్రామ పెద్దలతో కలిసి జనసేన పార్టీ మండల అధ్యక్షులు వంతల బుజ్జిబాబు ఆధ్వర్యంలో జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తమ్మిరెడ్డి శివ శంకర్ చేతుల మీదుగా విశాఖ పట్నం ఆర్కె బిచ్ రోడ్డు ఎదురుగా ఉన్న కార్యాలయంలో కండువా వేసుకుని జనసేన పార్టీలో చేరామని వైసీపీ వార్డ్ సభ్యులు పాంగి లింగారావు, సిందేరి సోమరాజు, కొర్ర రంగారావు, సాగిన వెంకట రమణ పీసా ఉప అధ్యక్షులు, సిందేరి చిన్నయ్య పీసా అధ్యక్షులు, పాలికి శ్రీను,కొర్ర రాజు బాబు గ్రామ పెద్ద, వంతల సుబ్బారావు గ్రామ పెద్ద,రమణ,కామేష్, వెంకట్ గూడెం మండలం నుంచి గుంట కోటి అన్నారు. గిరిజన ప్రాంతం పంచాయతీల అభివృద్ధి కోసం జనసేన పార్టీ కట్టుబడి ఉంటుందని ఆ నమ్మకంతో నేటి నుంచి పార్టీ సిద్ధాంతాలకు ఆశయాలకు కట్టుబడి పార్టీ నిర్మాణం బలోపేతం కోసం పని చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమానికి జనసేన పార్టీ నాయకులు మర్రి మనోహర్, గుంట చంటి,తదితరులు పాల్గొన్నారు.

## పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేసిన మేయర్ పీలా, ఎమ్మెల్యే పంచకర్ల



**పరవాడ, పతాకం న్యూస్:** పెందుర్తి నియోజకవర్గం, జీవీఎంసీ 93వ వార్డ్ కార్పొరేటర్ రాపర్తి కన్నా ఆధ్వర్యంలో సోమవారం నాడు సుమారు 2 కోట్ల రూపాయల అభివృద్ధి పనులకు పెందుర్తి శాసనసభ్యులు పంచకర్ల రమేష్ బాబు, విశాఖ నగర్ మేయర్ పీర్ల శ్రీనివాసరావు ముఖ్య అతిథులుగా పాల్గొని రెండు కోట్ల రూపాయలు విలువైన పలు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు.

ఈ సందర్భంగా పాత్రికేయ మిత్రులతో మాట్లాడుతూ విశాఖను ఆర్థిక రాజధానిగా అభివృద్ధి చేయడం ద్వారా ఉత్తరాంధ్రతో పాటు ఎంతో మందికి ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. అనంతరం పెందుర్తి నియోజవర్గం ప్రాంతంలో అభివృద్దే నా ప్రధమ కర్తవ్యమని, రాష్ట్ర ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి నాయకత్వంలో కూటమి ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్ళని, పెందుర్తి నియోజకవర్గం ఉన్న వార్డులను పూర్తిస్థాయిలో అభివృద్ధి చేయడం జరుగుతోందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక వార్డు కార్పొరేటర్ రాపర్తి కన్నా, జీవీఎంసీ జోన్ 8 జోనల్ కమిషనర్ శంకర్రావు, ఇంజనీరింగ్ విభాగం డి.ఈ.ప్రవీణ్, ఏ.ఈ.కుసుమ, మాజీ కార్పొరేటర్ రాపర్తి శైలజ, వార్డు అధ్యక్షులు తమరాడ ఆది బాబు, వరహాలు, సీనియర్ నాయకులు కోరుకొండ వరహాలు, ఎర్ర నాగరాజు, సేనాతీ దేవుడు, ఏఎంసి డైరెక్టర్ లక్కీ గోవింద్, హైమావతి, వార్డు అధ్యక్షులు పిన్నింటి పార్వతి, కంచిపాటి మధు, డి.బి.ఎల్.నాయుడు, మజ్జి సూరిబాబు, ఒబ్బిన శ్రీకాంత్, సీనియర్ నాయకులు జగన్మోహన్ పాత్రుడు, జుత్తాడ శ్రీనివాసరావు, మోటూరు చైతన్య, రాపర్తి కిషోర్, తనకాల శ్రీనివాసరావు, కర్రీ శివ, తదితరులు పాల్గొన్నారు.

## టెట్ నుంచి టీచర్లను మినహాయించాలి




**అమరావతి, పతాకం న్యూస్:** సర్వీసులో ఉన్న ఉపాధ్యాయులను ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) నుంచి మినహాయించాలని యుటిఎఫ్ మధ్యంతర కౌన్సిల్ డిమాండ్ చేసింది. విజయవాడలోని ఎంబి విజ్ఞాన కేంద్రంలో ఆ సంఘం మధ్యంతర కౌన్సిల్ జరిగింది. ఈ సమావేశాన్ని పిడిఎఫ్ ఎమ్మెల్సీ బొర్రా గోపిమూర్తి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 2010 కంటే ముందు ఉపాధ్యాయులుగా నియామకం పొందినవారు తప్పకుండా టెట్ అర్హత కావాలని సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిందని చెప్పారు. 2010 కంటే ముందు అందరూ డిఎస్సి ద్వారా నియామకం పొందారని వివరించారు. ప్రతియేటా పాఠశాల విద్యాశాఖ నిర్వహించే శిక్షణ తరగతులకు హాజరవుతున్నారని తెలిపారు. 12, 18, 24 ఏళ్ల స్కేళ్ల కోసం ఇఒ, జిఓ పరీక్షలు రాస్తున్నామని పేర్కొన్నారు. టెట్ నుంచి ఉపాధ్యాయులను మినహాయించాలని రాష్ట్రప్రభుత్వం సుప్రీంకోర్టులో రివ్యూ పిటిషన్ వేయాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలలన్నిటిలోనూ సమాంతర మీడియాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. పిఎంశ్రీ తరహాలో రాష్ట్రంలో కూడా సిఎంశ్రీ పాఠశాలలను గుర్తించి అభివృద్ధి చేయాలని కోరారు. యుటిఎఫ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎన్ వెంకటేశ్వర్లు, కెఎస్ఎస్ ప్రసాద్ మాట్లాడుతూ.. టెట్ ప్రవేశపెట్టకముందు నుంచే 2, 3 దశాబ్దాలుగా విజయవంతంగా ఉపాధ్యాయులు సర్వీసు అందిస్తున్నారు కాబట్టి మినహాయింపు ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరారు. విద్యార్థుల సంఖ్యతో నిమిత్తం లేకుండా ఐదు తరగతులకు ఐదుగురు ఉపాధ్యాయులను నియమించాలని కోరారు.

## బాపట్ల జిల్లాలో కారు-లారీ ఢీ
## నలుగురు మృతి



**బాపట్ల, పతాకం న్యూస్:** బాపట్ల జిల్లా కర్లపాలెం మండలం సత్యవతిపేటలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఆదివారం అర్ధరాత్రి దాటాక ఒంటిగంట సమయంలో కారు, లారీ ఢీకొన్నాయి. ఈ ఘటనలో కారులో ప్రయాణిస్తున్న నలుగురు మృతిచెందారు. మృతులను కర్లపాలెంకు చెందిన బేతాళం బలరామరాజు (65), బేతాళం లక్ష్మి (60), గాదిరాజు పుష్పవతి (60), ముదుచారి శ్రీనివాసరాజు (54)గా గుర్తించారు. ఈ ఘటనలో కారులో ప్రయాణిస్తున్న 13, 11 ఏళ్ల వయసున్న ఇద్దరు బాలురు గాయపడ్డారు. ప్రస్తుతం వాళ్లకు ప్రాణాపాయం తప్పినట్లు డాక్టర్లు చెప్పారు. బాపట్ల ఎమ్మెల్యే నరేంద్రవర్మ కుమారుడి సంగీతకు వెళ్లి వస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

## జల్ జీవన్ మిషన్ పనులు చేపట్టాలని వినతి



**అనంతగిరి, పతాకం న్యూస్:** పంచాయతీ గ్రామాలకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు మంజురు చేసిన జల్ జీవన్ మిషన్ పథకపు పనులు చేపట్టాలని కోరుతూ. టోకూరు పంచాయతీ సర్పంచ్ కిల్లో .మొస్య ఆధ్వర్యంలో వార్డు. పేసా కమిటీ సభ్యులు సోమవారం స్థానిక ఆర్డబ్ల్యూఎస్ ఏఇ గౌతమ్ కు కలిసి లిఖితపూర్వకంగా విన్నవించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మొస్య మాట్లాడుతూ బలియాగుడ. జాకరవలస. తెంతలిగుడ. సిసగుడ. గ్రామాలకు మంజూరైన పనులు త్వరితగతిన పునర్ ప్రారంభించాలని. అలాగే ఇప్పటికే పనులు పూర్తయిన ములియగూడ. బోడగూడ.కంభవరస గ్రామాలకు పంప్ హౌస్ షెడ్యూలకు కరెంటు మీటర్లు బిగించి తాగునీటి సరఫరా చేయాలని కోరారు. ఈ గ్రామాలకు పనులు పూర్తి అయిన అనంతరం మిగిలిన గ్రామాలకు కూడా గుర్తించి ఆ పథకపును పూర్తి చేసేందుకు కృషి చేస్తామని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు మెంబర్ పూజారి .లక్ష్మణరావు పేసా కమిటీ సభ్యులు సోమ్మెల .ఆనందరావు. సారా. సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

## తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షులుగా గొల్లపూడి పెద్దిరాజు



**రాజవొమ్మంగి, పతాకం న్యూస్ :** రాజవొమ్మంగి మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులుగా గొల్లపూడి పెద్దిరాజు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు, ప్రధాన కార్యదర్శి నారా లోకేష్, రాష్ట్ర పార్టీ అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు, రంపచోడవరం నియోజకవర్గం శాసనసభ్యులు మిరియాల శిరీష దేవి, తెలుగు యువత అధ్యక్షులు మఠం విజయభాస్కర్, నియోజకవర్గ అబ్జర్వర్ కొల్లుబోయిన శ్రీనివాస్, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు శివాజీ మొదలైన వారి సహకారంతో రెండోసారి మండలంలో తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షులుగా ఎన్నికయ్యానని వారికి ప్రత్యేకమైన కృతజ్ఞతలు తెలిపారు. పెద్దలు తనకు అప్పగించిన బాధ్యతను సత్యనిష్టతో అమలు చేస్తానని, మండలంలో పార్టీని మరింత బలోపేతం చేస్తానని తెలిపారు. వన్ టూ వన్, ఐవిఆర్ఎస్ కాల్స్ లో తనకు మద్దతు తెలిపిన మండల క్యాడరు కు, తెలుగుదేశం పార్టీలో ఉన్న ప్రతి కార్యకర్తకు కృతజ్ఞతలు తెలిపారు.

# చేనేత కుటుంబాలను ఆదుకోవాలి



**తాడేపల్లి, పతాకం న్యూస్:** ఇటీవల మొందా తుఫాన్ కారణంగా పనులు కోల్పోయిన చేనేత కుటుంబాలను ఆదుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతి చేనేత కుటుంబానికి 20000రూపాయిలు చెల్లించాలని, ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిల్లల మర్రి బాలకృష్ణ డిమాండ్ చేశారు. సోమవారం ఎంటిఎంసీ పరిధిలోని కుంచనపల్లి జై బేరి బహులంతస్తుల భవనం లో రాష్ట్ర చేనేత, జౌళి శాఖ మంత్రి సవితను కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా బాలకృష్ణ మాట్లాడుతూ చేనేత కుటుంబాలకు అసలే పనుల లేక ఇబ్బందులు పడుతుంటే, మొందా తుఫాన్ వల్ల పూర్తిగా పనులు లేకుండా పోయాయని అన్నారు. ఈ విపత్కర పరిస్థితులలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేనేత కుటుంబాలను ఆదుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. తుఫాను కారణంగా నష్టపోయిన రైతులు, మత్స్యకార కుటుంబాలను ఆదుకున్న విధంగానే, చేనేత కుటుంబాలను కూడా 20000 సహాయం అందించి ఆదుకోవాలని, ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం ప్రభుత్వాన్ని కోరుతుందన్నారు. ఇప్పటికే చేనేతన్నల కుటుంబాలకు బియ్యం, నిత్యవసర వస్తువులు రాష్ట్ర ప్రభుత్వం అందిస్తుందని, దీనికి చేనేత కార్మిక సంఘం ధన్యవాదాలు తెలుపుతుందన్నారు. ప్రభుత్వం చేసే ఈ సాయం కాకుండా ప్రతి కుటుంబానికి 20వేల రూపాయలు ఇవ్వాలని, రాష్ట్ర చేనేతన్నల తరఫున రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరుతున్నామన్నారు. ఎన్ డి ఏ కేంద్ర ప్రభుత్వాన్ని ఒప్పించి, తగువిధంగా చేనేత కుటుంబాలను ఆదుకోవాలని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఒక విధంగా కృషి చేయాలని ఆయన కోరారు. పని కోల్పోయిన చేనేత కుటుంబాలకు 20వేల రూపాయలతో పాటు, పడుగు, మగ్గం నష్టపోయిన ప్రతి కుటుంబానికి నష్టం అంచనా వేసి పరిహారం అందించాలన్నారు.

## వాడవాడలా అరకు కాఫీ ఘుమఘుమలు




**నర్సీపట్నం, పతాకం న్యూస్:** అంతర్జాతీయంగా ప్రఖ్యాతి గాంచిన అరకు ఫిల్టర్ కాఫీ ఘుమఘుమలు ఇప్పుడు వాడవాడలా వ్యాపించబోతున్నాయి. పొదుపు సంఘాల మహిళలతో అరకు కాఫీ స్టాల్స్ ఏర్పాటు చేసి వారికి జీవనోపాధిని మరింత మెరుగుపరచడానికి సెర్ప్ అధికారులు ప్రణాళిక రూపొందిస్తున్నారు. బాగా రద్దీగా ఉండే ప్రదేశాలలో స్టాల్స్ ఏర్పాటు చేయనున్నారు. ఇందులో భాగంగా సెర్ప్ అధికారులు నేటివ్ సంస్థలో ఒప్పందం చేసుకున్నారు. ఒక్కొక్క యూనిట్‌కు రూ.5.9 లక్షలు అవసరమని గుర్తించారు. పీఎంఎఫ్ఎంఈ పథకం ద్వారా రూ.4.02 లక్షలు రుణం ఇచ్చి 35 శాతం రాయితీ మంజూరు చేస్తారు. మిగిలిన పెట్టుబడికి స్త్రీనిధి నుంచి రుణం ఇస్తారు. తొలుత నర్సీపట్నం, పాయకరావుపేట, అనకాపల్లి, చోడవరం, ఎస్.రాయవరంలో పెట్టాలని అధికారులు ప్రతిపాదించారు. ముందుగా నర్సీపట్నం మండలం అమలాపురానికి చెందిన ఎస్‌హెచ్‌జీ మహిళకు యూనిట్ మంజూరు చేశారు. శారదానగర్ మెయిన్ రోడ్డు నుంచి బలిఘట్టం వెళ్లే మలుపులో అరకు కాఫీ స్టాల్ ఏర్పాటు చేస్తారు. అమ్మకాలు అధికంగా జరిగే రద్దీ ప్రదేశాలలో కాఫీ స్టాల్స్ పెట్టుకోవాలని సూచిస్తున్నారు. పొదుపు సంఘాల నుంచి స్టాల్స్ పెట్టుకోవడానికి ముందుకు వస్తే ప్రోత్సహిస్తామని వెలుగు డీపీఎం సత్యనారాయణ తెలిపారు. యాజమాన్యం అనుమతితో అరకు ఫిల్టర్ కాఫీతో పాటు కాఫీ పొడి, ఇతర ఉత్పత్తులు కూడా విక్రయించుకోవచ్చు.

## తుఫాన్ నష్టంపై త్వరలో నివేదిక



**చోడవరం, పతాకం న్యూస్:** జిల్లాలో తుఫాన్‌కు దెబ్బతిన్న పంటలు, ఆస్తి నష్టంపై అంచనాలు వేస్తున్నారని, త్వరలోనే ప్రభుత్వానికి నివేదిస్తామని జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొల్లు రవీంద్ర తెలిపారు. ఆయన స్థానిక ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజుతో కలిసి భోగాపురం వద్ద శారదా నది గట్లను, రాయపురాజుపేటలో కొట్టుకుపోయిన వంతెనను పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, శారదా పరీవాహక ప్రాంతాల్లో పరిస్థితిని పరిశీలించామని, రైతుల సమస్యలు పరిష్కరించేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతుందన్నారు. తుఫాన్ నష్టానికి సంబంధించి సీఎం చంద్రబాబునాయుడు అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా నివేదికలు తెప్పించుకుంటున్నారని, తుఫాన్ బాధితులకు ఇప్పటికే అత్యసవర సహాయ కార్యక్రమాలు పూర్తయ్యాయని చెప్పారు. రహదారులు, ఇరిగేషన్, ఇతర రంగాలకు సంబంధించి దశలవారీగా మరమ్మతు పనులు చేపడతామని తెలిపారు. నదుల గట్లను పటిష్ఠం చేయాల్సిన అవసరం వుందని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా భోగాపురంలో మహిళా రైతులు మంత్రిని కలిసి, నది గట్టుకు కోతకు గురైన ప్రదేశంలో రక్షణ గోడను నిర్మించాలని, లేకపోతే భవిష్యత్తులో గండి పడి తీవ్ర నష్టం వాటిల్లుతుందని చెప్పారు. రక్షణ గోడ ఆవశ్యకతను ఎమ్మెల్యే రాజు కూడా మంత్రికి వివరించారు. రాయపురాజుపేటలో ఎర్రిగెడ్డపై వంతెన, రోడ్డు నిర్మాణం, ఊరగెడ్డపై వంతెన నిర్మాణం చేపడితే రైతులకు ఉపయోగకరంగా ఉంటుందని ఎమ్మెల్యే వివరించారు.

## బల్క్ డ్రగ్ పార్క్ రద్దు చేయాలని హోమ్ మినిస్టర్ కు రాజయ్యపేట గ్రామస్తులు వినతిపత్రం

**నక్కపల్లి, పతాకం న్యూస్:** సోమవారం నక్కపల్లి ఎంపీడీవో కార్యాలయంలో రాష్ట్ర హోమ్ మినిస్టర్ వంగలపూడి అనిత నిర్వహించిన గ్రీవెన్స్ డే పిజిఆర్ఎస్ కార్యక్రమంలో రాజయ్యపేట మత్స్యకారులు హోమ్ మినిస్టర్ కి గంగమ్మను మత్స్యకారులకు దూరం చేసే బల్క్ డ్రగ్ పార్క్ రద్దు చేయాలని బల్క్ డ్రగ్ పార్క్ రావడం వలన ప్రత్యక్షంగా పరోక్షంగా పచ్చటి పొలాల్లో నాశనం అవుతాయి , సముద్ర సంపద మొత్తం నాశనమవుతుంది కాబట్టి ఇలాంటి బల్క్ డ్రగ్ పార్క్ రద్దు చేయాలని లేని పక్షంలో ఈ ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని మత్స్యకారులు అన్నారు. ఈ కార్యక్రమంలో మత్స్యకార నాయకులు బాబ్జి, మహేష్, సోమేశ్, కాశి, సోమేష్,మాధవ, నరేష్, స్వామి సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

## కక్ష సాధింపు నారా వారి
## కొత్త చట్టంలా మారింది: సజ్జల



**తాడేపల్లి, పతాకం న్యూస్:** రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక 'ప్రభుత్వం' అనే పదానికే అర్థం మారిపోయిందని, ప్రభుత్వమే వ్యవస్థీకృత నేరాలకు పాల్పడుతోందని వైసీపీ రాష్ట్ర కో-ఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ప్రభుత్వాలు ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేయాలి కానీ, కూటమి ప్రభుత్వం మాత్రం వ్యవస్థలను గాలికి వదిలేసి ప్రత్యర్థులపై కక్ష సాధింపులకు దిగుతోందని ఆరోపించారు. మాజీ మంత్రి జోగి రమేశ్ అరెస్ట్‌తో వీరి వికృత చేష్టలు పరాకాష్ఠకు చేరాయని ఆయన విమర్శించారు. నకిలీ మద్యం కేసు వ్యవహారంపై సజ్జల మాట్లాడుతూ, ఈ వ్యవహారంలో టీడీపీ నేత జయచంద్రారెడ్డి పాత్ర స్పష్టంగా కనిపిస్తోందని, అందుకు తగిన ఆధారాలున్నాయని తెలిపారు. జయచంద్రారెడ్డి మనుషులే నకిలీ మద్యం ఫ్యాక్టరీలు నడిపి, వారి షాపుల్లోనే అమ్ముతున్నారని ఆరోపించారు. ఆయనకు ఆఫ్రికాలో వ్యాపారాలు ఉన్నాయని ఎన్నికల అఫిడవిట్‌లోనూ స్పష్టంగా పేర్కొన్నారని గుర్తుచేశారు. ఇంత స్పష్టంగా ఆధారాలున్నా, వాస్తవాలను పక్కనపెట్టి వైసీపీ నేతలపై నెపం మోపడానికి జోగి రమేశ్‌ను అసంబద్ధంగా అరెస్ట్ చేశారని మండిపడ్డారు. కూటమి అధికారంలోకి వచ్చిన నాటి నుంచి వైసీపీ నేతలు, కార్యకర్తలపై కక్ష సాధింపు చర్యలు పెరిగిపోయాయని సజ్జల ఆవేదన వ్యక్తం చేశారు. టీడీపీ గ్రూపుల గొడవల్లో జరిగిన జంట హత్యల కేసును తమ పార్టీ నేత పిన్నెల్లి రామకృష్ణారెడ్డి సోదరులపై పెట్టారని అన్నారు. తునిలో మైనర్ బాలికపై టీడీపీ నేత అత్యాచారం చేస్తే, సంబంధం లేని వైసీపీ కార్యకర్తలను పోలీస్ స్టేషన్లకు పిలిచి వేధిస్తున్నారని ఆరోపించారు. సోషల్ మీడియా కేసులో గంజాయి పెట్టి అరెస్ట్ చేస్తే హైకోర్టు కూడా ప్రభుత్వానికి మొట్టికాయలు వేసిందని గుర్తుచేశారు. రాష్ట్రంలో లోకేశ్ 'రెడ్ బుక్' పాలన నడుస్తోందని, ఆయన నేతృత్వంలో విధ్వంసకర పాలన సాగిస్తున్నారని సజ్జల విమర్శించారు. "ప్రతిపక్షం గొంతు వినిపించకూడదనే ఉద్దేశంతో ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు. కేవలం వాంగ్మూలాల ఆధారంగా వైసీపీ నేతలను అరెస్ట్ చేసి జైళ్లలో పెడుతున్నారు. కక్ష సాధింపే 'నారా వారి కొత్త చట్టం'లా మారింది" అని ఆయన వ్యాఖ్యానించారు. జోగి రమేశ్ ఇంట్లో పెన్‌డ్రైవ్‌లు, హార్డ్ డిస్క్‌లు దొరికాయంటూ చట్టాన్ని పూర్తిగా దుర్వినియోగం చేస్తున్నారని, నేరం చేయకపోయినా తమ నేతలు శిక్షకు గురవుతున్నారని అన్నారు. ఇన్ని జరుగుతున్నా రాష్ట్రంలో నకిలీ మద్యం అమ్మకాలు మాత్రం ఆగడం లేదని సజ్జల విమర్శించారు

## శ్రీకృష్ణ ఆలయ పున నిర్మాణానికి శంకుస్థాపన



**నక్కపల్లి, పతాకం న్యూస్:** నక్కపల్లి మండలం చిన దొడ్డి గల్లు యాదవ వీధిలో శ్రీకృష్ణ ఆలయ పునర్నిర్మాణానికి సోమవారము శ్రీకృష్ణ యాదవ సంక్షేమ సంఘం, గ్రామ పెద్దలు ఆధ్వర్యంలో శంకుస్థాపన చేశారు అతి ప్రాచీన కాలంలో నిర్మించిన శ్రీకృష్ణ మందిరము, శ్రీకృష్ణుని విగ్రహము శిథిలవస్థకు చేరడంతో యాదవులు అందరూ కలిసికట్టుగా, తిరిగి ఆలయ పునిర్మాణానికి చేపట్టడానికి, ఆగమ పండితులు శ్రీమాన్ రేజేటి శ్రీరామాచార్యులు, సీతారామాచార్యులు తదితర పండితులతో శంకుస్థాపన కార్యక్రమం నిర్వహించారు. అలాగే శ్రీకృష్ణ ఆలయ నిర్మాణానికి భక్తులందరు వాగ్దానం చేశారు. శ్రీకృష్ణ ఆలయ నిర్మాణముతో ప్రజల్లో భక్తి భావం పెరుగుతుందన్నారు ఈ కార్యక్రమంలో పంపన బోయిన శ్రీను, చొప్ప నాగరాజు, పంపన బోయిన సూరిబాబు, ఆడబోయిన అప్పలరాజు, సంఘ సభ్యులు పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

## జీవన వృక్ష చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మొక్కల పంపిణీ

**కొయ్యూరు, పతాకం న్యూస్:** అల్లూరి జిల్లా, కొయ్యూరు మండలం,రొబ్బసింగి, గదబపాలెం గ్రామాలలో జీవన వృక్ష చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షులు కోరుప్రోలు రమణబాబు ఆధ్వర్యంలో రైతులకు ఉచిత జీడీ మామిడి, స్కూల్ ఉన్న పిల్లలకు జామ మొక్కలు పంపిణిచేశారు.ప్రతి ఇంటి ఆవరణలో మొక్కలు నాటుదాం, పర్యావరణాన్ని కాపాడుదాం అనే నినాదంతో కార్యక్రమం ప్రారంభించారు.ఈ సమావేశంలో రొబ్బసింగి, గదబపాలెం పాఠశాలల ఉపాధ్యాయులు గోరా పంతులు బాబు,కూడా పద్మ, ట్రస్ట్ కార్యదర్శి గోరా సూరిబాబు, సర్పంచ్ ఉల్లి నరసమ్మ,రెండు గ్రామాల రైతులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## గ్రామాల్లో పంట నష్టం జాబితాలు ప్రదర్శన



**అమరావతి, పతాకం న్యూస్:** మొంథా తుపాను కారణంగా పంట నష్టపోయిన రైతుల జాబితాను గ్రామ స్థాయిలో ప్రదర్శించి సామాజిక తనిఖీ చేయాలని అధికారులకు వ్యవసాయశాఖ డైరెక్టర్ మనజీర్ జిలానీ ఆదేశించారు. పంట నష్టం నమోదు ప్రక్రియ చివరి దశకు చేరుకుందని, ఇప్పటి వరకూ ప్రాథమిక అంచనా విస్తీర్ణం 1,24,416 హెక్టార్లలో 90 శాతం ఎన్యూమరేషన్ ప్రక్రియ పూర్తి చేసినట్లు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 19 జిల్లాల్లో నమోదు ప్రక్రియ పూర్తి చేసుకోవడంతో సామాజిక తనిఖీ చేపట్టబోతున్నాయని తెలిపారు. తుపాను ప్రభావం ఎక్కువగా ఉన్న అంబేద్కర్ కోనసీమ, కాకినాడ, కృష్ణా, తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల్లో నష్టం అంచనా కొంత మేర పెరిగినట్లు తెలిపారు. ఈ జిల్లాలో నమోదు ప్రక్రియ తుది దశకు చేరుకుందన్నారు. పంట నష్టం నమోదు పూర్తయిన వెంటనే సామాజిక తనిఖీ చేపట్టి, రైతుల విజ్ఞప్తులను స్వీకరించేలా క్షేత్రస్థాయి అధికారులకు మార్గదర్శకాలు విడుదల చేయాలన్నారు. నమోదు ప్రక్రియ పూర్తి స్థాయి పారదర్శకంగా జరగాలని ఆదేశించారు. రైతుల నుంచి అందిన ఫిర్యాదులు, విజ్ఞప్తులను స్వీకరించి పరిశీలించి, పరిష్కరించి గ్రామసభ ఆమోదంతోనే తుది జాబితాను ప్రకటించాలని ఆదేశించారు.

## గగనవీధుల్లో దూసుకెళ్లిన 'ఎల్‌వీఎం-3'



**తిరుపతి, పతాకం న్యూస్:** ఇస్రో చేపట్టిన ఎల్‌వీఎం3 మిషన్ 5 'బాహుబలి' రాకెట్ ప్రయోగం విజయవంతమైంది. కౌంట్‌డౌన్ అనంతరం కమ్యూనికేషన్ శాటిలైట్ సిఎంఎస్-3 కమ్యూనికేషన్ ఉపగ్రహాన్ని 16.09 నిమిషాల్లో నింగిలోకి మోసుకెళ్లి భూస్థిర కక్ష్యలోకి విజయవంతంగా చేర్చింది. ఇది ఎల్‌వీఎం 3 సిరీస్‌లో ఐదో విజయవంతమైన ప్రయోగం. శ్రీహరికోట సతీష్ ధావన్ స్పేస్ సెంటర్ నుంచి సాయంత్రం 5.26 గంటలకు ఎల్‌వీఎం 3 ఎం5 రాకెట్ నిప్పులు చెరుగుతూ నింగిలోకి దూసుకెళ్లింది. 4,410 కిలోల బరువు ఉన్న ఉపగ్రహాన్ని భూస్థిర కక్ష్యలో నిలపడం ద్వారా దేశంలో కమ్యూనికేషన్, నావిగేషన్, రక్షణ వ్యవస్థలను మరింత బలోపేతం చేసే విధంగా రూపకల్పన చేశారు. 'భారత అంతరిక్ష ప్రయోగంలో ఇది ఒక మైలురాయి' అని ఈ ప్రయోగాన్ని పర్యవేక్షించిన ఇస్రో చైర్మన్ వి.నారాయణన్ వ్యాఖ్యానించారు. మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ ప్రయోగం వల్ల దేశీయ సాంకేతికతతోపాటు కమ్యూనికేషన్ సేవలు మరింత మెరుగుపడతాయని, జాతీయ భద్రతలో కీలకంగా అంతరిక్షం నుంచి నిఘా మరింత పటిష్టం చేయడంలో ఈ శాటిలైట్ కీలకంగా మారనుందని చెప్పారు. ముఖ్యంగా చైనా, పాకిస్తాన్ నౌకల కదలికలపై నిఘా ఉంటుందని, దేశరక్షణ వ్యవస్థలో కీలకమైన జలాంతర్గాములు, నౌకలకు సాంకేతిక సహకారం అందిస్తుందని తెలిపారు. ఆ దిశగా ఎల్‌వీఎం 3 రాకెట్ పదేళ్లపాటు సేవలు అందించే దిశగా రూపకల్పన చేసినట్లు వివరించారు. జిశాట్-7 స్థానంలో ఎల్‌వీఎం-3 రాకెట్ విజయవంతంగా ప్రయోగించామని, ఇది అద్భుత విజయమని పేర్కొన్నారు.

## కారును ఢీకొని మరో మూడు వాహనాలపై టిప్పర్ పల్టీ..
## 10 మంది దుర్మరణం



**జైపూర్:** రాజస్థాన్ రాజధాని జైపూర్‌లో సోమవారం ఉదయం పెను విషాదం చోటుచేసుకుంది. మద్యం మత్తులో ఉన్న ఓ డంపర్ ట్రక్ డ్రైవర్ బీభత్సం సృష్టించాడు. వేగంగా వాహనాన్ని నడుపుతూ పలు వాహనాలను ఢీకొట్టడంతో దాదాపు 10 మంది అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోగా, సుమారు 40 నుంచి 50 మంది తీవ్రంగా గాయపడ్డారు. మృతుల్లో ఓ చిన్నారి కూడా ఉన్నట్లు సమాచారం. హర్మడా పోలీస్ స్టేషన్ పరిధిలోని సికార్ రోడ్డు సమీపంలో ఈ దుర్ఘటన జరిగింది. పోలీసులు, ప్రత్యక్ష సాక్షుల కథనం ప్రకారం, మద్యం మత్తులో ఉన్న డ్రైవర్ డంపర్ ట్రక్కును అతివేగంతో నడుపుతూ నియంత్రణ కోల్పోయాడు. సుమారు అర కిలోమీటరు దూరం వరకు బ్రేకులు వేయకుండానే కార్లు, బైక్‌లతో సహా పలు వాహనాలను ఢీకొట్టుకుంటూ వెళ్లాడు. చివరికి ఓ కారును బలంగా ఢీకొట్టి, మరో మూడు వాహనాలపై బోల్తా పడ్డాడు. ఈ ప్రమాదంలో మొత్తం పదికి పైగా వాహనాలు ధ్వంసమయ్యాయి. ఈ ప్రమాద బీభత్సం మొత్తం అక్కడి సీసీటీవీ కెమెరాల్లో రికార్డైంది. ట్రక్కు వేగంగా దూసుకొచ్చి వాహనాలను చెల్లాచెదురు చేయడం, ప్రాణభయంతో జనం పరుగులు తీయడం వంటి దృశ్యాలు హృదయ విదారకంగా ఉన్నాయి. సమాచారం అందిన వెంటనే ఉన్నతాధికారులు ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. గాయపడిన వారిని సమీపంలోని సవాయి మాన్‌సింగ్ ఆసుపత్రికి తరలించారు. వారిలో పలువురి పరిస్థితి విషమంగా ఉండటంతో మృతుల సంఖ్య పెరిగే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. ఈ ఘటనపై రాజస్థాన్ మంత్రి డాక్టర్ ప్రేమ్ చంద్ బైర్వా తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. కాగా, 24 గంటల వ్యవధిలో రాజస్థాన్‌లో ఇది రెండో పెను ప్రమాదం కావడం గమనార్హం. ఆదివారం రాత్రి ఫలోది జిల్లాలో ఓ టూరిస్ట్ బస్సు ఆగి ఉన్న ట్రైలర్‌ను ఢీకొట్టిన ఘటనలో 15 మంది యాత్రికులు మృతి చెందారు. తాజా ఘటనతో రాష్ట్రంలో రోడ్డు భద్రతపై తీవ్ర ఆందోళన వ్యక్తమవుతోంది. ప్రమాదానికి కారణమైన డ్రైవర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# అమాయకుల బలికి కారకులెవరు?



**అమరావతి, పతాకం న్యూస్:** తిరునాళ్లు, జాతరలు తెలుగు ప్రజలకి కొత్తకాదు. ఎంతో సంబరంగా, ఉత్సాహంగా వాటిని నిర్వహించుకోవడం ఇక్కడ ఆనవాయితీ. లక్షల్లో జనం గుమిగూడినా, రేయింబవళ్లు వేచి చూసినా ఆ కార్యక్రమాలు ఎంతో సజావుగా గడిచిపోయేవి. అయితే ఇదంతా ఒకప్పుడు.. ఇప్పుడు అలా లేదు. జనసందోహాలతో, పోటెత్తిన సమూహాలతో ఉత్తరాదిలో తరచూ జరిగే ఉపద్రవాలు ఇక్కడ కూడా జరగడం ఆందోళన కలిగించే విషయం. తిరుపతి ఘటన మరువక ముందే తాజాగా శ్రీకాకుళంలోని కాశీబుగ్గ వెంకటేశ్వర ఆలయంలో దారుణం జరిగింది. మృతులంతా మహిళలు, పిల్లలు, వృద్ధులు. నిర్వాహకుల అలసత్వం, ప్రభుత్వ వైఫల్యం ఈ ఘటనలో కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. 12 ఎకరాల సొంత భూమిలో హరిముకుంద్ పండా ఈ ఆలయాన్ని ప్రారంభించారు. 5 ఎకరాల విస్తీర్ణంలో రూ.20 కోట్ల వ్యయంతో ఆలయాన్ని నిర్మించారు. ఈ ఏడాది మే నుండే ఇక్కడ దర్శనాలు మొదలయ్యాయి. ఇంత తక్కువ సమయంలోనే ఆలయానికి ఇంత జనం పోటెత్తడానికి కారణమేంటి? 2 నుండి 3 వేల లోపు భక్తులకి మాత్రమే అవకాశమున్న ఆలయానికి 15 వేలకి మించి జనాలు వచ్చారు. 'నవంబరు 1న, శనివారం కార్తీక ఏకదాశి పర్వదినాన వేంకటేశ్వరున్ని దర్శించుకుంటే మీకు' అంటూ సోషల్‌మీడియాలో విపరీత ప్రచారం చేశారు. ఆలయ నిర్మాణం గురించి గతంలో అనేకసార్లు విశేషంగా ప్రస్తావించారు. దీంతో స్వల్ప కాలంలోనే ఈ ఆలయం చిన్న తిరుపతిగా ప్రసిద్ధిలోకి వచ్చింది. ఇప్పుడు 'పవిత్ర దినం' అన్న ముద్ర అదనంగా తోడైంది. ఫలితంగా చుట్టుపక్కల గ్రామాల నుండి మహిళలు, పిల్లలు, వృద్ధులు తండోపతండాలుగా తరలివచ్చారు. ఇంత విస్తృతంగా ప్రచారం చేసిన ఆలయ నిర్వాహకులు అందుకు తగిన స్థాయిలో పటిష్ట భద్రత ఏర్పాటు చేయలేదు. కనీసం ప్రైవేటు వాలంటీర్లతో రక్షణ చర్యలు కూడా చేపట్టలేదు. సాధారణంగా జన సమూహాలు పోగయ్యేచోట ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ పెడుతుంది. 'చట్టప్రకారం ఇంతమంది పోగవ్వకూడదు' అన్న రూల్స్‌ని కూడా ఖరాఖండిగా పాటిస్తుంది. ప్రభుత్వ చర్యలకి ఎన్నోసార్లు ఎంతోమంది ఇబ్బందులు పడిన సందర్భాలు కూడా ఉన్నాయి. ఇక ఆలయాల్లో జరిగే విశేష క్రతువులప్పుడు పాలకుల ఆదేశాలతో అధికారులు తమ సిబ్బందిని సమాయత్తం చేయడం కనిపిస్తుంది. కానీ ఇక్కడ అలాంటిదేమీ జరగలేదు. 'అది ప్రైవేటు వ్యక్తులు నిర్వహించే ఆలయం. కార్యక్రమం గురించి మాకు ముందస్తు సమాచారం ఇవ్వలేదు. కాబట్టే ఈ ప్రమాదం జరిగింద'ని చేతులు దులుపుకోవడం ప్రజా సంరక్షణ పట్ల పాలకుల చిత్తశుద్ధికి అద్దం పడుతోంది.

భీతావహంగా ఉన్న ఈ దృశ్యాలని చూసిన వారంతా అయ్యో అని కన్నీరుపెట్టారు. అయితే.. ఈ ప్రమాదం దానంతట అదే వచ్చిపడింది కాదు. నిర్వాహకులు, యంత్రాంగ లోపం ప్రధానంగా కనిపిస్తున్నా, మరో కోణం కూడా ఎవరికి వారే పరిశీలించుకోవాలి. ఈ మధ్యకాలంలో ప్రధాన స్రవంతి టివి కార్యక్రమాల్లో సోషల్‌మీడియాలో ఇలాంటి పూజా క్రతువుల గురించి విశేషప్రచారం చేస్తున్నారు. పూలు, పళ్లు, అగరుబత్తీ, కర్పూరాలు, ఆకు, వక్క వంటి పూజాద్రవ్యాలని ఎంతో శ్రద్ధగా పట్టుకువచ్చిన వారంతా ఈ 'పవిత్ర దినం'న ఎలాగైనా 'స్వామివారి దర్శనం చేసుకోవాల్సిందే' అన్న దృఢసంకల్పంతో అక్కడ వేచి ఉన్నారు. తెల్లవారే ఇంట్లో పిల్లలకి, భర్తకి కావాల్సినవన్నీ సర్దిపెట్టి బయల్దేరారు కొందరు. ఇంట్లో ఉన్న మామ్మలు ఎప్పటినుండో గుడికి తీసుకెళ్లమంటు న్నారని వాళ్లని వెంటపెట్టుకొచ్చారు ఇంకొందరు. ఈ 'పవిత్ర దినం'న దర్శించుకుంటే మంచిదని ప్రచారం చూసినప్పటి నుండి పిల్లలతో గుడికి వెళ్లాల్సిందేనని మొండిపట్టు పట్టి భర్తలతో కదిలివచ్చారు మరికొందరు. వేకువజాము నుండే భక్తుల తాకిడి ఎక్కువైంది. అప్పటివరకు సందడిసందడిగా ఉన్న ఆలయ ప్రాంగణంలో ఒక్కసారిగా సంభవించిన అనుకోని ప్రమాదంతో భీకర ఆర్తనాదాలు చుట్టుముట్టాయి. ఏడుపులు, పెడబొబ్బలతో జనాలు పరుగులు పెట్టారు. అయినవారి ఆచూకి కానరాక, ఊపిరాడని ఆ గుంపులోనే తమవాళ్లని వెతుక్కున్నారు చాలామంది. ఏం జరిగిందో అర్థంకాని అయోమయంలో అరుస్తూ, ఏడుస్తూ బయటికి పరుగెత్తారు అనేకమంది. పూలసజ్జలు, ఆరతిపళ్లేలు, పూజాద్రవ్యాలు ఎక్కడపడితే అక్కడ చిందరవందరంగా పడిఉన్నాయి. రెప్పపాటు కాలంలో అంతా అయిపోయింది. అభంశుభం తెలియని అమాయకులు, పిల్లల ప్రాణాలు గాల్లో కలిసిపోయాయి.

## విద్యార్థుల ఆరోగ్యంపై శ్రద్ధేదీ?



**గుంటూరు, పతాకం న్యూస్:** పల్నాడు జిల్లా పిడుగురాళ్ల వద్ద పిల్లుట్ల రోడ్డులోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల బాలుర వసతి గృహం అధ్వాన పరిస్థితిలో ఉంది. ఈ వసతి గృహంలోకి వెళ్లేందుకు సరైన రహదారి లేదు. తాగునీటి సరఫరా చేసే పైపులైన్లు తుప్పుపట్టి పాచితో కన్పిస్తున్నాయి. కాంపౌండ్ వాల్ లేదు. వర్షాలకు హాస్టల్ పరిసరాల్లో మురుగు నీరు చేరి విద్యార్థులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. రాజధాని ప్రాంతంలోని మంగళగిరి ఎస్‌సి బాలిక వసతి గృహంలోని 125 మంది బాలికలకు నాలుగు మరుగుదొడ్లు, నాలుగు బాత్ రూములు మాత్రమే ఉన్నాయి. దీంతో, బాలికలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. బాలుర వసతి గృహంలో 24 మంది విద్యార్థులు ఉండగా, మరుగుదొడ్ల నిర్వహణ సరిగా లేక దుర్వాసన వెదజల్లుతోంది. బిసి బాలికల కళాశాల వసతి గృహంలో 58 మంది విద్యార్థులు ఉంటున్నారు. కనీస సౌకర్యాలు లేకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పెదనందిపాడు మండలం అన్నపర్రు వెనుకబడిన తరగతుల సంక్షేమ హాస్టల్‌లో గత నెల పదిన 55 విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. వసతి గృహం విద్యార్థులను బయట జరిగే ఫంక్షన్లకు పంపిస్తున్నారని, బయట వండిన ఆహారాన్ని తీసుకువచ్చి విద్యార్థులకు అందిస్తున్నారనే ఆరోపణలు వచ్చాయి. ఈ అంశంపై రాష్ట్ర న్యాయ శాఖ ఆదేశాల మేరకు జిల్లాకు చెందిన ఇద్దరు న్యాయమూర్తులు వెళ్లి ఈ వసతి గృహాన్ని తనిఖీ చేశారు. అసౌకర్యాలపై న్యాయమూర్తులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. బడుగు, బలహీన వర్గాల విద్యార్థులు ఉండే సంక్షేమ వసతి గృహాల్లో కనీస సౌకర్యాల కల్పనలో పాలకులు ఏ మాత్రమూ దృష్టి సారించడం లేదు. గుంటూరు, పల్నాడు జిల్లాల్లో పలు వసతి గృహాల్లో తీవ్ర అసౌకర్యాల మధ్య విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రధానంగా ఎక్కువ వసతి గృహాల్లో పారిశుధ్యం అధ్వానంగా ఉంది. తీవ్ర తాగునీటి సమస్య వేధిస్తోంది. తాగునీరు సరఫరా చేసే ప్లాస్టిక్ టిన్నుల్లో ఈకోలన్ బ్యాక్టీరియా కూడా ఉన్నట్టు పలు వసతి గృహాల్లో జరిపిన పరీక్షల్లో వెల్లడైంది. మరుగుదొడ్లు, స్నానపు గదులు సరిగా లేవు. వసతి గృహాల్లో దోమలు, క్రిమికీటకాల ధాటికి చర్మవ్యాధులు, జ్వరాల బారిన పడుతున్నారు. విద్యార్థులు అనారోగ్యానికి గురైతే వారిని ఇళ్లకు పంపేసి అధికారులు చేతులు దులుపుకొంటున్నారు. వసతి గృహాలపై ఉన్నతాధికారుల పర్యవేక్షణ కొరవడింది. మంత్రులు, ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు, జిల్లా అధికారులు వసతి గృహాలపై దృష్టి సారించడం లేదు. ఏదైనా సంఘటన జరిగితే తప్ప ఎవ్వరూ అటువైపు కన్నెత్తి చూడడం లేదు. వసతి గృహాల్లో గతంలో ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు రాత్రి బస చేసి విద్యార్థులతో మమేకమై వారి సమస్యలు పరిష్కరించేందుకు గతంలో ప్రభుత్వాలు ప్రయత్నించాయి. గత కొనేళ్లుగా అధికారులు, ప్రజాప్రతినిధులు వసతి గృహాల విద్యార్థుల సమస్యలను పట్టించుకోవడం లేదన్న విమర్శలు వస్తున్నాయి. గుంటూరు, పల్నాడు జిల్లాల్లో దాదాపు 30 వసతి గృహాల్లో తగిన సిబ్బంది లేరు. వసతి గృహాలకు సరఫరా చేసే తాగునీటికి అధికారులు పరీక్షలు చేయడం లేదు. దీనివల్ల తరచూ డయేరియా సమస్యలు వస్తున్నాయి.

## ఢిల్లీని కమ్మేసిన కాలుష్య మేఘాలు..



**గుంటూరు, పతాకం న్యూస్:** దేశ రాజధాని నగరం న్యూఢిల్లీని కాలుష్య మేఘాలు కమ్మేశాయి. దట్టమైన దుప్పటి కప్పుకున్నట్లు కనిపిస్తోంది. అనేక ప్రాంతాల్లో 'తీవ్రమైన' వాయు కాలుష్య స్థాయిలను ఎదుర్కొన్నాయి. గాలి నాణ్యత సూచిక (ఎక్యూఐ) 400 మార్కును దాటింది. ఆనంద్ విహార్, చాందిని చౌక్, నెహ్రూ నగర్, ఆర్కే పురం, రోహిణితో సహా అనేక ప్రాంతాలు 400 కంటే ఎక్కువ ఎక్యూఐ నమోదు చేశాయి.దట్టమైన పొగమంచు నగరాన్ని ఆవరించింది. అయితే కృత్రిమ వర్షాల కోసం తాము చేపట్టిన క్లౌడ్ సీడింగ్ (మేఘ మథనం) కారణంగా వాయు కాలుష్య తీవ్రత తగ్గిందని ఢిల్లీలోని బిజెపి ప్రభుత్వం ప్రకటించింది. ఈ ప్రకటనపై ప్రతిపక్షాలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశాయి. ప్రజల ప్రాణాలతో బిజెపి క్రూర పరిహాసమాడుతోందని కాంగ్రెస్ సీనియర్ నాయకులు జైరాం రమేశ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. అదే పార్టీకి చెందిన నాయకులు, వాయినాడ్ ఎంపీ ప్రియాంక గాంధీ సైతం ఢిల్లీలో వాయు కాలుష్య తీవ్రతపై ఆందోళన వ్యక్తం చేశారు. రాజకీయాలకు అతీతంగా కలిసికట్టుగా ఈ సమస్యను ఎదుర్కొందామని, ఇందుకోసం తగిన కార్యచరణ తక్షణమే చేపట్టాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఆమె కోరారు. కాగా కాలుష్య కారణంగా ఢిల్లీలో శ్వాసకోశ సమస్యలతో బాధపడుతున్న వారి సంఖ్య పెరిగిందని వైద్యులు తెలిపారు. ప్రజలు క్రమం తప్పకుండా ఎయిర్-ప్యూరిఫైయర్లను వినియోగించాలని సూచించారు. శ్వాసకోశ వ్యాధులతో బాధపడుతున్నవారు రాబోయే కొన్ని వారాల పాటు ఢిల్లీని విడిచిపెట్టి వెళ్లాలన్నారు.

# ‘డార్క్ చాక్లెట్?’ తింటే మంచిదేనా?



చాక్లెట్లను చిన్నా, పెద్దా అనే తేడా లేకుండా అందరూ చాలా ఇష్టంగా తింటారు. అన్ని రకాల చాక్లెట్స్?తో పోలిస్తే, డార్క్ చాక్లెట్? వల్ల అనేక ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయని నిపుణులు చెబుతున్నారు. వీటి వల్ల గుండె ఆరోగ్యం మెరుగుపడటం, మధుమేహం నియంత్రణ, రక్తపోటు తగ్గడం, మెదడు పనితీరు మెరుగుపడటం, ఒత్తిడి తగ్గడం వంటి ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయని పేర్కొంటున్నారు. ఇది చర్మ సంరక్షణకు కూడా సహాయపడుతుందని నిపుణులు తెలియజేస్తున్నారు. ఇందులో ఫ్లేవనాయిడ్లు శరీర కణాలను ఫ్రీ రాడికల్స్ నుంచి రక్షించి, అనేక వ్యాధుల ప్రమాదాన్ని తగ్గిస్తాయని వివరిస్తున్నారు. మరోవైపు వీటి వల్ల ఆరోగ్య ప్రయోజనాలతో పాటు నష్టాలు కూడా ఉన్నాయని నిపుణులు హెచ్చరిస్తున్నారు. డార్క్ చాక్లెట్ ఫ్లేవనాయిడ్లు అనే శక్తివంతమైన యాంటీ ఆక్సిడెంట్లతో నిండి ఉంటుందని నిపుణులు చెబుతున్నారు. ఇవి వాపు, ఆక్సీకరణ ఒత్తిడిని తగ్గించడానికి సహాయపడుతుందని అంటున్నారు. అంతేకాకుండా రాత్రిపూట శరీర కణాల పునరుద్ధరణకు తోడ్పడతాయని వివరిస్తున్నారు. డార్క్ చాక్లెట్ అలసటను తగ్గించడంలో సహాయపడతాయని, మెదడు ఆరోగ్యం, జీవన నాణ్యతలో మెరుగుదలకు దారితీస్తుందని అధ్యయనం పేర్కొంది. డార్క్ చాక్లెట్ ‘ఫీల్-గుడ్’ రసాయనాలైన సెరోటోనిన్, ఎండార్ఫిన్ల ఉత్పత్తిని ప్రేరేపిస్తుందని నిపుణులు చెబుతున్నారు. ఇవి మెదడును ప్రశాంతంగా ఉండటానికి సహాయపడుతుందని అంటున్నారు. అంతేకాకుండా ఇందులో ఉండే పాలీఫెనాల్స్ అనేవి కార్టిసాల్ స్థాయిలను తగ్గించడంలో సహాయపడతాయని, దీంతో ఒత్తిడి తగ్గి ప్రశాంతంగా ఉండొచ్చని పేర్కొంటున్నారు.

డార్క్ చాక్లెట్‌లో సహజంగా కెఫిన్, థియోబ్రోమిన్ అనే ఉద్దీపనలు ఉంటాయని నిపుణులు చెబుతున్నారు. ముఖ్యంగా కెఫిన్‌కు సున్నితత్వం ఉన్నవారు పడుకునే ముందు ఇవి తింటే ఆలస్యంగా నిద్ర పట్టడం లేదా నిద్ర నాణ్యత తగ్గే ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నారు. అందుకే డార్క్ చాక్లెట్?ను అతిగా తినకుండా దీని ప్రయోజనాలను ఆస్వాదించడానికి మితంగా తీసుకోవాలని సూచిస్తున్నారు. కొంతమందికి కడుపులో యాసిడ్ రిఫ్లక్స్ లేదా గుండెల్లో మంటను ప్రేరేపించవచ్చని నిపుణులు చెబుతున్నారు. ముఖ్యంగా నిద్ర పోవడానికి ముందు ఇవి తింటే ఇలాంటి సమస్యలు రావొచ్చని హెచ్చరిస్తున్నారు. చాక్లెట్‌ను భోజనం తర్వాత తీసుకోవడం వల్ల అన్నవాహిక సమస్యలున్న రోగుల్లో యాసిడ్ ఎక్స్‌పోజర్ గణనీయంగా పెరిగిందని అధ్యయనం పేర్కొంది.

డార్క్ చాక్లెట్‌లో మిల్క్ చాక్లెట్ కంటే తక్కువ చక్కెర ఉన్నప్పటికీ, అది తీపి కోరికలను ప్రేరేపిస్తుందని నిపుణులు వివరిస్తున్నారు. దీన్ని రాత్రి సమయంలో అధికంగా తీసుకుంటే రక్తంలో చక్కెర స్థాయిలు, బరువు పెరగడానికి దారి తీస్తాయని చెబుతున్నారు. ఉదయం లేదా సాయంత్రం/రాత్రి చాక్లెట్ తినడం వల్ల శక్తి సమతుల్యత భిన్నంగా ప్రభావితమవుతుంది. శక్తి తీసుకోవడంలో మార్పులు, ఉపరితల ఆక్సీకరణ, మైక్రోబయోటా, సిర్కాడియన్-సంబంధిత వేరియబుల్స్ కారణంగా శరీర బరువుపై ప్రభావం చూపుతుందని % ప్రచురించింది.

రాత్రిపూట డార్క్ చాక్లెట్ తినాలనుకుంటే తక్కువ మొత్తంలో, నిద్రవేళకు కనీసం 1-2 గంటల ముందు తినడం మంచిదని నిపుణులు పేర్కొంటున్నారు. ఈ క్రమంలో 70 శాతం అంతకంటే ఎక్కువ కోకో కంటెంట్ ఉన్న డార్క్ చాక్లెట్‌ను మితంగా తీసుకోవడం మంచిదని సూచిస్తున్నారు. ఎందుకంటే ఇందులో ఆరోగ్యకరమైన ఫ్లేవనాయిడ్లు ఎక్కువగా ఉండి, చక్కెర తక్కువగా ఉంటుందని తెలియజేస్తున్నారు. అంతేకాకుండా, నిద్ర భంగం కలగకుండా ప్రశాంతత, మానసిక స్థితిని పెంచే ప్రయోజనాలను ఆస్వాదించవచ్చని సలహా ఇస్తున్నారు. ఒకవేళ మీకు నిద్ర సమస్యలు లేదా కెఫిన్? సున్నితత్వం ఉంటే, రాత్రిపూట డార్క్ చాక్లెట్? తినకపోవడమే మంచిదని సిఫార్సు చేస్తున్నారు.

# బ్లాక్ హెడ్స్ ఎందుకొస్తాయి? ఎలా తొలగించుకోవాలి

బ్లాక్ హెడ్స్ ప్రతి ఒక్కరినీ ఇబ్బంది పెడుతుంటాయి. వీటిని పోగొట్టుకోవడం నిజంగా సులువైన పని మాత్రం కాదు. అంతేకాదు ఎంత ప్రయత్నించినా బ్లాక్ హెడ్స్ సమస్యను శాశ్వతంగా నయం చేసుకోలేరని చెబుతున్నారు నిపుణులు. కాకపోతే కొన్ని జాగ్రత్తలు, పద్ధతులతో వీటి ప్రభావాన్ని చాలా వరకు తగ్గించవచ్చట. మార్కెట్లో బ్లాక్ హెడ్స్ నయం చేసేందుకు చాలా రకాల క్రీములు దొరుకుతున్నప్పటికీ అవి మచ్చలు, ఇన్?ఫెక్షన్లు, చికాకు వంటి ఇతర సమస్యలను తెచ్చి పెడుతున్నాయి. కాబట్టి బ్లాక్ హెడ్స్ రావడానికి కారణాలు ఏంటి? ఎన్ని చోట్ల ఏర్పడతాయి? వీటిని తొలగించుకోవడం అనే విషయాలపై పూర్తి అవగాహన కోసం మీరు ఈ వార్త చదవాల్సిందే. బ్లాక్ హెడ్స్ అనగానే కేవలం కంటి కింద కలిగే నల్లటి మచ్చలు అని అంతా అనుకుంటారు. కానీ నిజానికి బ్లాక్ హెడ్స్ అంటే కేవలం కళ్ల కింద మాత్రమే కాదు. ముఖం, శరీరంలోని ఇతర భాగాల్లో చాలా చోట్ల వస్తాయట. మరో ముఖ్యమైన విషయం ఏంటంటే ఇవి కేవలం నల్లటి రంగులో మాత్రమే ఉండవు. చర్మపు రంధ్రాలు నూనె, దుమ్ము వంటి చిన్న చిన్న మృత కణాల ద్వారా మూసికిపోయినప్పుడు ఏర్పడే మురికే ఈ బ్లాక్ హెడ్స్. వీటికి బయట గాలి తాకడం వల్ల ఆక్సీకరణం చెంది నల్లగా కనిపిస్తాయి. సాధారణంగా బ్లాక్ హెడ్స్ అనేవి శరీరంలో చమురు ఉత్పత్తి ఎక్కువగా ఉన్న చోట ఏర్పడతాయి. ఎక్కువ మందికి ఇవి ముక్కు చుట్టూ ఉండే ప్రాంతంలో, గడ్డం ఉండే చోట కనిపిస్తుంటాయి. దీంతో పాటుగా నుదురు, భూజాలు, వీపు, ఛాతి ప్రాంతాల్లో కూడా బ్లాక్ హెడ్స్ ఏర్పడతాయి.

మార్కెట్లో లభించే కొన్ని క్లీన్సర్లలో లభించే సాలిసిలిక్ యాసిడ్, చర్మంలో పేరుకుపోయిన చమురు, చనిపోయిన చర్మ కణాలను విచ్ఛిన్నం చేస్తుంది. సాలిసిలిక్ యాసిడ్ వాష్?ను ముందుగా మీరు రోజుకు ఒకసారి మాత్రమే ఉపయోగించాలి.

ఇది మీ ముఖానికి పడుతుంది అనిపిస్తే, సమస్య తగ్గుతుందని నమ్మకం కలిగితే క్రమంగా దీంతో రోజుకు రెండు సార్లు మీరు ముఖం కడుక్కోవచ్చు. నిజానికి మొటిమలు, మచ్చలు వంటి సమస్యలను ఎక్స్‌ఫోలియేషన్ పెద్దగా తగ్గించలేనప్పటికీ బ్లాక్ హెడ్స్ విషయంలో మాత్రం చక్కగా ఉపయోగపడుతుంది. ముఖ్యంగా ఆల్ఫా, బీటా హైడ్రాక్సీ యాసిడ్స్ (%ూనూ,దీనూ%)లు కలిగిన పదార్థాలు బ్లాక్ హెడ్స్ సమస్యకు మంచి పరిష్కారంగా మారతాయి. ఇక్కడ ఓ ముఖ్య విషయం ఏంటంటే మీరు చర్మాన్ని ఎక్స్‌ఫోలియేట్ చేసేందుకు ఉపయోగించే బ్రష్?లు చాలా సున్నితంగా ఉండేలా చూసుకోండి. సున్నితమైన చర్మం కలిగిన వారు దీనికి కాస్త దూరంగా ఉండటమే మంచిది. చర్మపు రంధ్రాల్లో నుంచి దుమ్ము, ధూళి, నూనె, మృత కణాలు వంటి వాటిని తొలగించడంలో క్లే మాస్క్ చాలా బాగా పనిచేస్తుంది. ఇందులోని సల్ఫర్ చనిపోయిన మృతకణాలను తొలగించి చర్మాన్ని ఆకట్టుకునేలా తయారుచేస్తుంది.

బ్లాక్ హెడ్స్ సమస్యను తగ్గించుకోవాలంటే మేకప్ ప్రొడక్ట్స్ విషయంలో చాలా జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉంటుంది. మీరు ఉపయోగించే పదార్థాల్లో కోమేడోజెనిక్స్ లేకుండా చూసుకోవాలి. అలాగే రాత్రి నిద్ర పోయేముందు కచ్చితంగా మేకప్ తీసేసి ముఖాన్ని శుభ్రంగా కడుక్కుని పడుకోవాలి.



# నల్లవాగుపై ప్రమాదకరంగా బ్రిడ్జీ

## రాకపోకలకు నేటికీ తప్పని ఇక్కట్లు



**అద్దంకి, పతాకం న్యూస్:** నిత్యం వందల వాహనాలు ప్రయాణించే అద్దంకి–రేణింగవరం రోడ్డు లో నల్లవాగుపై ఉన్న కల్వర్టు వద్ద ప్రమాదం పొంచి ఉంది. ఇటీవల కురిసిన మొంథా తుఫాన్ ప్రభావంతో నల్లవాగుకు వరద ప్రవాహం పెరిగింది. కల్వర్టు సపోర్ట్ వాల్ కోసుకుపోయింది. అసలే శిథిలావస్థకు చేరిన కల్వర్టు వరదతో మరింత బలహీన పడింది. కల్వర్టు ఇరుకుగా ఉండడంతో వాహనాలు ఎదురెదురు వచ్చిన సమయంలో ప్రమాదం జరిగే అవకాశం ఉందని వాహ నచోదకులు ఆందోళన చెందుతున్నారు. అద్దంకి నుంచి రేణింగవరం వరకు డబుల్ రోడ్డుగా మార్చిన ప్పటికి నల్లవాగు కల్వర్టు మాత్రం చిన్నదిగా ఉంది. జార్లపాలెం, కశ్యాపురంల వద్ద ఉన్న కల్వర్టులు కూడా దెబ్బతిన్నాయి. వర్షాల సమయంలో రాకపోకలు నిలిచి పోతున్నాయి. వాహనాల రాకపోకలు పెరిగినందున మూడు వాగులపై వంతెనల నిర్మాణం చేపట్టాలని వాహనచోదకులు, ప్రజలు కోరుతున్నారు.

తుఫాన్ ప్రభావంతో కురిసిన భారీ వర్షాలతో రహదారులపై వర్షంనీరు వీడలేదు. గ్రామాలలో దీంతో అంటువ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని రైతులు వాపోతున్నారు. మండలంలోని కొప్పెరపాడు గ్రామంలోని ఉన్నత పాఠశాల పక్కన ఉన్న వీధిలో వారం రోజుల నుంచి వర్షపు నీరు పెద్ద ఎత్తున నిలిచి ఉంది. ఈ నీరు వెళ్లే కాలువలు లేక పోవడంతో అలానే ఉంది. ప్రజలు నీటిలోనే రాక పోకలు సాగిస్తున్నారు. కాలువలు లేకపోవడంతో ఈ నీరు అలానే పాచిపట్టిందని ప్రజలు వాపోతున్నారు. చిన్నపాటి వర్షం కురిసినా, రోడ్లపై నీరు నిలుస్తోందని, విద్యార్థులు సైతం పాఠశాలకు రావాలంటే తీవ్ర ఇబ్బంది పడుతున్నారని ప్రజలు వాపోతున్నారు. అధికారులు వెంటనే వర్షపు నీరు ముందుకు వెళ్లేలా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

పంగులూరు ఇసుకవాగులో నేల చప్టాపై గుంతలను పూడ్చేందుకు ఉపయోగించిన బంకమట్టితో వాహనచోదకులు ప్రమాదాల బారిన పడుతున్నారు. మొంథా తుపాన్ కారణంగా వరద తాకిడికి పంగులూరు నుంచి తక్కెళ్లపాడు వెళ్లే రోడ్డు లోని నల్లవాగు చప్టాపై భారీ గోతులు ఏర్పడ్డాయి. ఈ గోతులు పూడ్చేందుకు నల్లటి బంకమట్టిని వినియోగించడంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా ఉందని స్థానిక ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

అద్దంకి మండల కేంద్రమైన అద్దంకితో మండలం లోని మూడు గ్రామాలకు రాకపోకలు నేటికీ ప్రారంభం కాలేదు. యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులు చేపట్టిన మరో వారం పడుతుందని స్థానికులు పేర్కొంటున్నారు. తిమ్మాయపాలెం–ఇలపావులూరు ఆర్అండ్‌బీ రోడ్డులో మోదేపల్లి వద్ద చిలకలేరు వాగు ఉధృతికి రోడ్డు కోసుకుపోయింది. అదే సమయంలో పేరాయపాలెం వద్ద ధోర్నపువాగుపై ఉన్న వంతెన కొట్టుకుపోయింది. దీంతో మండలంలోని పేరాయపాలెం,? దేనువకొండ, ఉమ్మనేనివారిపాలెంల నుంచి అద్దంకికి రాకపోకలు నిలిచిపోయాయి. తాళ్లూరు, వెల్లంపల్లి మీదుగా అద్దంకి చేరుకోవాల్సి వస్తోంది. అదే సమయంలో తాళ్లూరు, చీమకుర్తి, మద్దిపాడు మండలాలలోని పలు గ్రామాల నుంచి కూడా అద్దంకికి వచ్చే అవకాశం లేకుండా పోయింది. అద్దంకి నుంచి తాళ్లూరు, గంగవరం, బొద్దికూరపాడులకు నడిచే ఆర్టీసీ బస్సులను నిలిపి వేశారు.

## తేనె ఎగుమతుల్లో వరల్డ్ నెం.2 మనమే!



**న్యూఢిల్లీ, పతాకం న్యూస్:** తేనె ఎగుమతుల్లో భారత్ సరికొత్త రికార్డు సృష్టించింది. ప్రపంచంలోనే రెండో అతిపెద్ద తేనె ఎగుమతిదారుగా అవతరించి తన సత్తా చాటింది. 2020లో 9వ స్థానంలో ఉన్న భారత్.. అనూహ్యమైన వృద్ధిని సాధించి ఈ ఘనతను అందుకుంది. 2023–24 ఆర్థిక సంవత్సరంలో దేశం నుంచి 1.07 లక్షల మెట్రిక్ టన్నుల సహజసిద్ధమైన తేనె ఎగుమతి కాగా, దీని విలువ 177.55 మిలియన్ డాలర్లు (సుమారు రూ. 1,480 కోట్లు) అని కేంద్ర ప్రభుత్వం ఆదివారం ఒక ప్రకటనలో వెల్లడించింది. కేంద్ర ప్రభుత్వం ప్రారంభించిన 'తీపి విప్లవం' ఈ విజయంలో కీలక పాత్ర పోషించింది. దేశంలో తేనెటీగల పెంపకాన్ని శాస్త్రీయంగా ప్రోత్సహించడం, నాణ్యమైన తేనె ఉత్పత్తిని పెంచడమే లక్ష్యంగా 'నేషనల్ బీకీపింగ్ అండ్ హనీ మిషన్' (%చీదీఎవీ%)ను ప్రభుత్వం అమలు చేస్తోంది. ఆత్మనిర్భర్ భారత్ కార్యక్రమంలో భాగంగా 2020–21 నుంచి 2022–23 వరకు రూ. 500 కోట్ల బడ్జెట్‌తో ఈ పథకాన్ని ప్రారంభించారు. దీనికి లభించిన ఆదరణతో, మిగిలిన రూ. 370 కోట్ల బడ్జెట్‌తో మరో మూడేళ్లపాటు (2025–26 వరకు) పొడిగించారు.తేనెటీగల పెంపకం కేవలం తేనె ఉత్పత్తికే పరిమితం కాదు. ఇది వ్యవసాయ ఆధారిత గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు వెన్నుదన్నుగా నిలుస్తోంది. పంట పొలాల్లో పరాగ సంపర్కానికి తేనెటీగలు ఎంతగానో దోహదపడతాయి. తద్వారా పంటల దిగుబడి పెరిగి రైతుల ఆదాయం రెట్టింపు అవుతుంది. తేనె మాత్రమే కాకుండా, మైనం, బీ పోలెన్, రాయల్ జెల్లీ వంటి ఇతర విలువైన ఉత్పత్తులు కూడా గ్రామీణ ప్రాంతాల్లోని రైతులకు, భూమిలేని నిరుపేదలకు అదనపు ఆదాయ వనరుగా మారాయి.ఈ మిషన్‌ను మూడు ఉప–మిషన్లుగా విభజించి అమలు చేస్తున్నారు. మొదటిది, శాస్త్రీయ పెంపకం ద్వారా పంటల ఉత్పాదకతను పెంచడం. రెండోది, తేనె సేకరణ, ప్రాసెసింగ్, మార్కెటింగ్ వంటి మౌలిక సదుపాయాలను మెరుగుపరచడం. మూడోది, వివిధ ప్రాంతాలకు అనువైన పరిశోధనలు, సాంకేతికతను అభివృద్ధి చేయడం. తేనె నాణ్యతను, అది ఎక్కడ తయారైందో తెలుసుకునేందుకు 'మధుక్రాంతి' అనే ఆన్‌లైన్ పోర్టల్‌ను కూడా ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చింది. దేశంలోని విభిన్న వాతావరణ పరిస్థితులు తేనెటీగల పెంపకానికి విస్తృత అవకాశాలు కల్పిస్తుండటంతో, భవిష్యత్తులో భారత్ ఈ రంగంలో మరింత ఉన్నత స్థాయికి చేరగలదని నిపుణులు అంచనా వేస్తున్నారు.




## భారత మహిళల జట్టుకు బీసీసీఐ రూ.51 కోట్ల నజరానా



భారత మహిళల క్రికెట్ చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించదగిన రోజు. దశాబ్దాల నిరీక్షణకు తెరదించుతూ భారత మహిళల జట్టు తొలిసారి ఐసీసీ ప్రపంచకప్‌ను ముద్దాడి చరిత్ర సృష్టించింది. ముంబైలోని డీవై పాటిల్ స్టేడియంలో ఆదివారం రాత్రి ఉత్కంఠభరితంగా జరిగిన ఫైనల్లో దక్షిణాఫ్రికాపై 52 పరుగుల తేడాతో ఘన విజయం సాధించి విశ్వవిజేతగా నిలిచింది. ఈ చారిత్రక విజయంపై దేశవ్యాప్తంగా సంబరాలు మిన్నంటాయి.

ఈ గెలుపును పురస్కరించుకుని క్రీడాకారిణులు, సహాయక సిబ్బందికి బీసీసీఐ కార్యదర్శి దేవజిత్ సైకియా రూ. 51 కోట్ల భారీ నజరానా ప్రకటించారు. ఇది భారత మహిళల క్రికెట్‌ను మరో స్థాయికి తీసుకెళ్లే చారిత్రక విజయమని ఆయన కొనియాడారు. ఐపీఎల్ ఛైర్మన్ అరుణ్ ధుమాల్ స్పందిస్తూ, "1983లో కపిల్ దేవ్ నాయకత్వంలోని పురుషుల జట్టు సాధించిన విజయాన్ని భారత మహిళలు పునరావృతం చేశారు. ఈ గెలుపు దేశంలో మహిళల క్రికెట్‌కు నూతన ఉత్తేజాన్ని ఇస్తుంది" అని ప్రశంసించారు.

### ఆల్‌రౌండర్ల ప్రదర్శనతో

# మహిళల ప్రపంచకప్‌ను గెలుచుకున్న భారత జట్టు




భారత మహిళల క్రికెట్ జట్టు చరిత్ర సృష్టించింది. కోట్లాది మంది అభిమానుల ఆశలను నిజం చేస్తూ తొలిసారిగా ఐసీసీ మహిళల ప్రపంచకప్ టైటిల్‌ను కైవసం చేసుకుంది. నవీ ముంబైలోని డీవై పాటిల్ స్పోర్ట్స్ అకాడమీ వేదికగా జరిగిన ఉత్కంఠభరిత ఫైనల్ మ్యాచ్‌లో దక్షిణాఫ్రికాపై 52 పరుగుల తేడాతో అద్భుత విజయం సాధించింది. మొదట బ్యాటింగ్‌లో షఫాలీ వర్మ అద్భుత ఇన్నింగ్స్‌కు, చివర్లో దీప్తి శర్మ ఆల్‌రౌండ్ ప్రదర్శన తోడవడంతో భారత్ జగజ్జేతగా నిలిచింది. దక్షిణాఫ్రికా కెప్టెన్ లారా వోల్వార్ట్ వీరోచిత సెంచరీ చేసినా, తన జట్టును గెలిపించలేకపోయింది. ఈ మెగా ఫైనల్‌లో టాస్ గెలిచిన దక్షిణాఫ్రికా కెప్టెన్, ఫీల్డింగ్ ఎంచుకుంది. దీంతో బ్యాటింగ్‌కు దిగిన భారత జట్టుకు ఓపెనర్లు స్మృతి మంధన (45), షఫాలీ వర్మ (87) అద్భుతమైన శుభారంభం అందించారు. ముఖ్యంగా షఫాలీ తనదైన శైలిలో దూకుడుగా ఆడి కేవలం 78 బంతుల్లో 7 ఫోర్లు, 2 సిక్సర్లతో 87 పరుగులు చేసి భారీ స్కోరుకు పునాది వేసింది. వీరిద్దరూ తొలి వికెట్‌కు 104 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పారు. అనంతరం జెమీమా రోడ్రిగ్స్ (24), కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ (20) త్వరగానే వెనుదిరిగినా, ఆల్‌రౌండర్ దీప్తి శర్మ (58) బాధ్యతాయుతమైన ఇన్నింగ్స్‌తో ఆదుకుంది. చివరి ఓవర్లలో వికెట్ కీపర్ రిచా ఘోష్ (24 బంతుల్లో 34) మెరుపులు మెరిపించడంతో భారత జట్టు నిర్ణీత 50 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 298 పరుగుల భారీ స్కోరు సాధించింది. సఫారీ బౌలర్లలో అయాబొంగా ఖాకా 3 వికెట్లు పడగొట్టింది.

299 పరుగుల భారీ లక్ష్య ఛేదనలో దక్షిణాఫ్రికాకు ఆదిలోనే ఎదురుదెబ్బ తగిలింది. అయితే, కెప్టెన్ లారా వోల్వార్ట్ (101) ఒంటరి పోరాటం చేసింది. ఒకవైపు వికెట్లు పడుతున్నా, ఆమె మాత్రం అద్భుతమైన షాట్లతో భారత బౌలర్లపై ఒత్తిడి పెంచింది. కేవలం 98 బంతుల్లో 11 ఫోర్లు, 1 సిక్సర్‌తో సెంచరీ పూర్తి చేసుకుంది. అయితే, మిగతా బ్యాటర్ల నుంచి ఆమెకు సరైన సహకారం అందలేదు. సఫారీ ఇన్నింగ్స్‌లో అనెరీ డెర్క్‌సెన్ (35) మినహా ఎవరూ రాణించలేకపోయారు.

ఈ దశలో భారత ఆల్‌రౌండర్ దీప్తి శర్మ బంతితో మ్యాజిక్ చేసింది. కీలకమైన వోల్వార్ట్ వికెట్‌తో సహా మొత్తం 5 వికెట్లు పడగొట్టి దక్షిణాఫ్రికా పతనాన్ని శాసించింది. ఆమె అద్భుతమైన బౌలింగ్‌కు సఫారీ బ్యాటర్లు నిలవలేకపోయారు. దీప్తికి తోడుగా షఫాలీ వర్మ కూడా 2 కీలక వికెట్లు తీసి తన ఆల్‌రౌండ్ సత్తాను చాటింది. దీంతో దక్షిణాఫ్రికా జట్టు 45.3 ఓవర్లలో 246 పరుగులకే ఆలౌట్ అయింది. ఫలితంగా భారత అమ్మాయిలు 52 పరుగుల తేడాతో చారిత్రక విజయాన్ని అందుకుని ప్రపంచకప్‌ను గర్వంగా ముద్దాడారు.

2005, 2017 వన్డే వరల్డ్ కప్ లలో టీమిండియా అమ్మాయిలు ఫైనల్ చేరినా, కప్ దక్కించుకోలేకపోయారు. ఇప్పుడా లోటును తీర్చుతూ, చారిత్రక విజయం నమోదు చేశారు.




## స్టైలిష్ క్లైమాక్స్.. సిద్ధం చేసిన

# 'మన శంకరవరప్రసాద్ గారు'



చిరంజీవి కథానాయకుడిగా ఆనిల్ రావిపూడి తెరకెక్కిస్తున్న చిత్రం 'మన శంకరవరప్రసాద్ గారు , నయనతార కథానాయిక. ఈ సినిమాను షైన్ స్క్రీన్స్, గోల్డ్ బాక్స్ ఎంటర్టైన్మెంట్స్ సాహు గారపాటి, సుస్మిత కొణిదెల నిర్మిస్తున్నారు. ఇటీవలే విడుదలైన ప్రచార చిత్రాలు సినిమాపై అంచనాలను తారస్థాయికి తీసుకెళ్లాయి. వచ్చే ఏడాది సంక్రాంతికి విడుదలవుతున్న ఈ సినిమా మాటింగ్ శరవేగంగా సాగుతోంది.తాజాగా ఈ చిత్రానికి సంబంధించి కీలక షెడ్యూల్ గురించి అప్డేట్ ఇచ్చారు. మేకర్స్. ఆదివారం నుంచి చిరంజీవి, ఫైటర్స్ బృందంపై స్టైలిష్ క్లైమాక్స్ షూట్ చేస్తున్నట్లు మేకర్స్ తెలిపారు. ఇది ప్రేక్షకులను ఆకట్టుకునేలా ఉంటుందని, విజువల్‌గా అద్భుత అనుభూతిని ఇస్తుందని పేర్కొన్నారు.

ఈ చిత్రంలో కథానాయకుడు వెంకటేశ్ ఓ అతిథి పాత్రలో కనిపించనున్నారు.

## షూటింగ్ ముగించుకున్న రామ్ పోతినేని

# 'ఆంధ్రా కింగ్ తాలూకా'



ఎనర్జిటిక్ స్టార్ రామ్ పోతినేని తన కొత్త చిత్రం 'ఆంధ్రా కింగ్ తాలూకా' షూటింగ్ పూర్తి చేసుకున్నట్లు ప్రకటించారు. ఈ విషయాన్ని ఆయన సోషల్ మీడియా ద్వారా అభిమానులతో పంచుకున్నారు. సినిమా చిత్రీకరణ విజయవంతంగా ముగిసిందని తెలుపుతూ, విడుదల తేదీని కూడా ఖరారు చేశారు. ఈ చిత్రాన్ని నవంబర్ 28న ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నట్లు వెల్లడించారు.ఈ సందర్భంగా రామ్ తన సోషల్ మీడియా ఖాతాలో ఒక పోస్ట్ పెట్టారు. "ఫైనల్‌గా షూటింగ్ పూర్తయింది. నేను గర్వపడే సినిమా ఇది. మనమందరం గర్వపడే సినిమా అవుతుంది. త్వరలోనే మీ ముందుకు వస్తున్నాం" అని పేర్కొన్నారు. ఈ సినిమాపై ఆయన పూర్తి సంతృప్తితో ఉన్నట్లు ఈ పోస్ట్ ద్వారా స్పష్టమవుతోంది.

అంతేకాకుండా, తన కెరీర్‌లో ఇలాంటి ఒక అందమైన చిత్రాన్ని అందించినందుకు దర్శకుడు పి. మహేశ్ బాబుకు రామ్ ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. ఈ ప్రకటనతో రామ్ అభిమానుల్లో సినిమాపై అంచనాలు మరింత పెరిగాయి. సినిమా టైటిల్ ఆసక్తికరంగా ఉండటంతో, రామ్ ఈసారి ఎలాంటి కథతో రాబోతున్నాడని సినీ వర్గాల్లో చర్చ మొదలైంది.




# 'శివ'లో ఆ రౌడీ పాత్రకు మోహన్‌బాబు

## ఆర్జీవీ ఎందుకు వద్దన్నారంటే?



తెలుగు సినిమా చరిత్రలో ఒక కొత్త అధ్యాయాన్ని సృష్టించిన చిత్రం 'శివ'. నాగార్జున కథానాయకుడిగా, రాంగోపాల్ వర్మ దర్శకత్వంలో వచ్చిన ఈ సినిమా ఒక ట్రెండ్‌సెట్టర్‌గా నిలిచింది. ఇప్పుడు ఈ కల్ట్ క్లాసిక్ చిత్రాన్ని అత్యాధునిక 4యశీ టెక్నాలజీతో మెరుగుపరిచి నవంబర్ 14న థియేటర్లలో మళ్లీ విడుదల చేయనున్నారు. ఈ సందర్భంగా సినిమాకు సంబంధించిన ఒక ఆసక్తికరమైన విషయం వెలుగులోకి వచ్చింది.

ఈ చిత్రంలో రఘువరన్ గ్యాంగ్‌లో ఉండే రౌడీ గణేశ్ పాత్ర సినిమాకు చాలా కీలకం. హీరోను ఎదిరించే సన్నివేశంలో ఈ పాత్ర మరింత ప్రభావవంతంగా ఉండాలనే ఉద్దేశంతో, నిర్మాత అక్కినేని వెంకట్ ఆ పాత్రకు ప్రముఖ నటుడు మోహన్ బాబు పేరును సూచించినట్లు సమాచారం. ప్రేక్షకులకు సుపరిచితమైన నటుడైతే ఆ సన్నివేశం బాగా పండుతుందని ఆయన భావించారు.

అయితే, ఈ ప్రతిపాదనను దర్శకుడు రాంగోపాల్ వర్మ సున్నితంగా తిరస్కరించారట. దీనికి గల కారణాన్ని కూడా ఆయన స్పష్టంగా వివరించినట్లు తెలుస్తోంది. "మోహన్ బాబు గారికి తెలుగు ప్రేక్షకుల్లో ఒక ఫ్యామిలీ మ్యాన్ ఇమేజ్ ఉంది. ఆయన డైలాగ్ డెలివరీకి ఒక ప్రత్యేకమైన స్టైల్ ఉంది. అలాంటి స్టార్‌డమ్ ఉన్న వ్యక్తి రౌడీ పాత్రలో కనిపిస్తే, ప్రేక్షకులు ఆ పాత్రలోని క్రూరత్వాన్ని, భయాన్ని కాకుండా మోహన్ బాబునే చూస్తారు. అది సన్నివేశం సహజత్వాన్ని దెబ్బ తీస్తుంది" అని వర్మ చెప్పారట.

పాత్రకు వాస్తవికత తీసుకురావాలనే ఆలోచనతో, వర్మ ఆ పాత్ర కోసం కొత్త నటుడు విశ్వనాథ్‌ను ఎంపిక చేశారు. వర్మ తీసుకున్న ఆ నిర్ణయం ఎంత సరైనదో సినిమా చూశాక అందరికీ అర్థమైంది. ఇప్పుడు 'శివ' రీ-రిలీజ్ అవుతున్న వేళ, ఈ పాత జ్ఞాపకాలు మరోసారి సినీ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి.

Edited, Printed, Published & Owned by **LEKKALA SREENU** and Published from D.NO: 4-14/5-201, Revenue Ward NO. 57, Aganampudi, Near Toll Gate, Duvvada, Talarivanipalem,VISAKHAPATNAM, AP-530049 and Printed at **Guddapuvalasa Ramani**, D.No. 18-135/1/1, Opp. Apollo Hospital, Pedagadhili, VISAKHAPATNAM, A.P.-530040. E-mail: Pathakamnews.ap@gmail.com, **Mobile No: 7097975757, Reg No. APTEL/25/A2082**